# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

శనివారం, హైదరాబాద్ 26.04.2025 | 24 క్యారెట్లు ₹94,550 | కిలో వెండి ₹1,11,000 | 36 | సంపుటి:3 | సంచిక:175

www.vishalabharati.com


## ఇండియా, పాకిస్థాన్
# సంయమనం పాటించాలి

- జమ్మూలో పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నాం
- ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నది
- పౌరులపై దాడి ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు
- ఏదైనా సమస్య ఉంటే చర్చలతో పరిష్కరించుకోండి
- ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్



విశాలభారతి,స్టేట్ బ్యూరో:
పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని భారత్ సహా యావత్ ప్రపంచం తీవ్రంగా ఖండిస్తోంది. ఐక్యరాజ్యసమితి కూడా ఈ దాడిని హేయమైనదిగా అభివర్ణించింది. 2లో..



## ఇండియాలో వెంటనే
# పీవోకేను కలపాలి

- పాకిస్తాన్‌ను మళ్లీ ఓడగొట్టాలి
- ప్రధానికి మా మద్దతు ఉంటుంది
- సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి
- పహల్గాం మృతులకు నివాళిగా క్యాండిల్ ర్యాలీ
- పీపుల్స్ ప్లాజా నుంచి నెక్లెస్ రోడ్డు చౌరస్తా దాకా
- హాజరైన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

2లో..

విశాలభారతి, స్టేట్ బ్యూరో
జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడిని నిరసిస్తూ హైదరాబాద్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు ప్రదర్శన చేపట్టారు. ఈ ప్రదర్శనలో సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ, భారత్ సమ్మిట్‌కు వచ్చిన విదేశీ ప్రతినిధులు పాల్గొన్నారు. భారత్ సమ్మిట్ కు హాజరైన వివిధ దేశాల ప్రతినిధులు కూడా ఈ కొవ్వొత్తుల ర్యాలీలో భాగస్వామ్యం అయ్యారు.

# బార్డర్‌లో టెన్షన్




## భారత్‌ని రెచ్చగొడుతున్న పాక్!

- ఎల్‌ఓసీ వెంబడి ఫైరింగ్
- కాశ్మీర్‌లో ఉగ్రవాదుల ఏరివేతకు 'ఎన్‌కౌంటర్'
- పాక్‌పై ప్రతీకారం తీర్చుకోవాలి
- ఇండియా వ్యాప్తంగా డిమాండ్లు, విజ్ఞప్తులు
- ఇప్పటికే పాకిస్థాన్‌పై ఆంక్షలు విధించిన ఇండియా
- కేంద్రం తీసుకునే చర్యలపై సర్వత్రా ఉత్కంఠ



విశాలభారతి, స్టేట్ బ్యూరో:
పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం నెలకొన్న ఉద్రిక్తతలను మరింత పెంచుతూ, శుక్రవారం ఉదయం నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ) వెంబడి కొన్ని చోట్ల పాకిస్థాన్ సైన్యం కాల్పులకు తెగబడింది. ఈ నేపథ్యంలో పాక్ చర్యలను భారత సైన్యం సమర్థవంతంగా ప్రతిఘటించింది. పహల్గామ్‌లో టూరిస్ట్‌లను ఉగ్రవాదులు కాల్చి చంపిన కొన్ని రోజుల వ్యవధిలోనే ఎల్‌ఓసీ వెంబడి కాల్పుల మోత మోగింది. ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్‌తో ఇప్పటికే బలహీనంగా సంబంధాలను భారత్ మరింత తగ్గించేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. ఇక ఎల్‌ఓసీ వెంబడి తాజా పరిస్థితులపై భారత సైన్యం స్పందించింది. "ఎల్‌ఓసీ వెంబడి కొన్ని చోట్ల పాకిస్థాన్ సైన్యం చిన్న ఆయుధాలతో ఫైరింగ్ ప్రారంభించింది. భారత సైన్యం తిప్పికొట్టింది. ఈ ఘటనలో ఇప్పటివరకు ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది," అని ఆర్మీ అధికారి వెల్లడించారు. మరోవైపు ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది మరికొన్ని గంటల్లో శ్రీనగర్‌కి వెళ్లనున్నారు. అక్కడ అధికారులతో చర్చలు జరపనున్నారు. ఎల్‌ఓసీ వెంబడి పరిస్థితులను సమీక్షించనునరారు. 2లో..

## ఇస్రో మాజీ ఛైర్మన్ కస్తూరి రంగన్
# కన్నుమూత

- వృద్ధాప్య సంబంధిత రుగ్మతలతో తుదిశ్వాస
- ఎన్ఈపి 'ముసాయిదా కమిటీ'కి అధ్యక్షులు కస్తూరి



2లో..

## హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో
# ఎంఐఎం గెలుపు

- మీర్జా రియాజ్కు 63 ఓట్లు పోలవగా
- ప్రత్యర్థి బీజేపీ అభ్యర్థి గౌతంరావుకు 25 ఓట్లు పడ్డాయి.
- 112 ఓట్లకు గానూ 88 ఓట్లు పోలయ్యాయి
- 22 ఏళ్ల తరువాత తొలిసారిగా ఎన్నిక



విశాలభారతి, స్టేట్ బ్యూరో:
హైదరాబాద్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో మజ్లిస్ పార్టీ విజయం సాధించింది. ఆ పార్టీ అభ్యర్థి మీర్జా రియాజ్కు 63 ఓట్లు పోలవగా, ప్రత్యర్థి బీజేపీ అభ్యర్థి గౌతంరావుకు 25 ఓట్లు పడ్డాయి. దీంతో అధికారులు ఎంఐఎం అభ్యర్థిని విజేతగా ప్రకటించారు. ఈ రెండు పార్టీల మధ్య జరిగిన పోరులో కాంగ్రెస్, బీఆర్ఎస్ వ్యూహాల వల్ల ఎంఐఎం మరోసారి హైదరాబాద్ జిల్లా ఎమ్మెల్సీ స్థానాన్ని కైవసం చేసుకుంది. గత 22 ఏళ్లుగా ఏకగ్రీవం అవుతూ వచ్చిన ఈ స్థానానికి అనూహ్యంగా బీజేపీ రంగంలోకి దిగడంతో పోటీ అనివార్యమైంది. 2లో..

## పాకిస్థానీలను గుర్తించి
# వెంటనే పంపించండి

- రాష్ట్రాల సీఎంలతో అమిత్ షా
- పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో కేంద్ర చర్యలు
- 27న పాకిస్థాన్ పౌరులకు జారీ చేసిన అన్నిరకాల వీసాల రద్దు
- పాక్‌లో ఉన్న భారత జాతీయులు కూడా తిరిగి వచ్చేయండి

2లో..



## ప్రపంచ శాంతి కోసం
# 'భారత్ సమ్మిట్-2025'

- హైదరాబాద్లో 2 రోజుల సదస్సు
- హెచ్ఐసీసీలో సదస్సు నిర్వహణకు ఏర్పాట్లు
- దాదాపు 100 దేశాల నుంచి 450 మంది ప్రతినిధులు హాజరు
- నిర్వహణకు ఏర్పాట్లు పరిశీలించిన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, శ్రీధర్ బాబు,



2లో..



# ప్రభుత్వానికి సహకరిస్తాం

- ఉగ్ర దాడికి ప్రతిగా ప్రభుత్వం ఏ చర్యలు తీసుకున్నా స్వాగతిస్తాం
- జమ్మూలో పర్యటించిన కాంగ్రెస్ నేత రాహుల్

2లో..

## మేడిగడ్డ ఏడో బ్లాక్‌ను
# తొలగించాల్సిందే

- ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ క్షేత్రస్థాయిలో పర్యటన
- ప్రభుత్వానికి ఎన్డీఎస్ఏ నివేదిక
- మేడిగడ్డ సహా అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు
- నిర్మాణం, నాణ్యత, నిర్వహణ స్థాయిల్లోనూ లోపాలు

విశాలభారతి,స్టేట్ బ్యూరో:
మేడిగడ్డ సహా అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించి డిజైన్ మొదలు నిర్మాణం, నాణ్యత, నిర్వహణ వరకు అన్ని స్థాయిల్లోనూ లోపాలు ఉన్నాయని జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ స్పష్టం చేసింది. మేడిగడ్డ ఆనకట్టలోని ఏడో బ్లాక్‌ను సురక్షితంగా తొలగించడం లేదా స్థిరీకరణ చేయాలని నిపుణుల కమిటీ సిఫారసు చేసింది. బ్యారేజీలు దెబ్బ తిన్నందున అన్నారం, సుందిళ్ల నుంచి సైతం నీటి మళ్లింపు సురక్షితం కాదని స్పష్టం చేసింది. 2లో..

## రికార్డు స్థాయి
# ఉష్ణోగ్రతలు

- 3 రోజుల్లో 30 మంది బలి
- జాగ్రత్తలు తీసుకోండి..!
- వాతావరణ శాఖ హెచ్చరిక

2లో..



vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

శనివారం
26.04.2025
హైదరాబాద్

epaper:vishalabharati.com
www.vishalabharati.com



## ఇండియా, పాకిస్థాన్ సంయమనం పాటించాలి

(మొదటిపేజీ తరువాయి)

జమ్ముకశ్మీర్‌లో ఆందోళనకర పరిస్థితిని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ నిశితంగా పరిశీలిస్తున్నారని ఐరాస అధికార ప్రతినిధి స్టీఫెన్ డుజారిక్ తెలిపారు. ఉగ్రదాడిని ఐరాస తీవ్రంగా ఖండిస్తోందన్న ఆయన ప్రస్తుతం ఇరుదేశాలు సంయమనం పాటించాలని సూచించారు. 'జమ్ముకశ్మీర్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని ఐరాస తీవ్రంగా ఖండిస్తోంది. పౌరులపై దాడి ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. గుటెర్రస్ ఈ ఆందోళనకర పరిస్థితిని నిశితింగా పరిశీలిస్తున్నారు. భారత్‌పాకిస్థాన్ దేశాలు సంయమనం పాటించాలని కోరుతున్నాం. ఇరుదేశాల మధ్య ఏదైనా సమస్య ఉంటే శాంతియుత చర్చలతో వాటిని పరిష్కరించుకుంటారని ఆశిస్తున్నాం' అని పేర్కొన్నారు. ఉగ్రదాడికి ప్రతిగా సింధూ నదీ జలాల ఒప్పందం అమలును భారత్ నిలిపివేయడంపై మీడియా ప్రశ్నించగా.. ఈ ఉద్రిక్తతల వేళ ఇరుదేశాలు సంయమనం పాటించి, పరిస్థితులు మెరుగుపడేలా చర్యలు తీసుకుంటాయని ఆశిస్తున్నామని చెప్పారు. గత మంగళవారం మధ్యాహ్నం పహల్గాంలో సైనిక దుస్తుల్లో వచ్చిన ఉగ్రవాదులు పర్యాటకులే లక్ష్యంగా కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. మరికొందరు ప్రాణాలతో తప్పించుకున్నారు.

## ప్రభుత్వానికి సహకరిస్తాం

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

భారతీయులంతా ఐక్యంగా ఉండటం చాలా అవసరమని, తద్వారా ఉగ్ర చర్యలను, వారి లక్ష్యాలను దీటుగా ఎదుర్కోవచ్చని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ అన్నారు. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి ని విపక్షాలన్నీ ముక్తకంఠంతో ఖండించాయని, ఈ దాడికి ప్రతిగా ప్రభుత్వం ఏ చర్యలు తీసుకున్నా తాము మద్దతిస్తామని ఆయన స్పష్టంచేశారు. ఇవాళ శ్రీనగర్‌లో పర్యటించిన రాహుల్ గాంధీ.. జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్‌తో, సీఎంతో భేటీ అయ్యారు. అనంతరం ఉగ్రదాడి బాధితులను కలిసి మాట్లాడారు.సమాజాన్ని ముక్కలు చేయడం, సోదరుల మధ్య తగాదాలు సృష్టించడమే ఉగ్రవాదుల పని అని రాహుల్‌గాంధీ అన్నారు. భారతీయులంతా ఐక్యంగా ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం ఎంతో ముఖ్యమని చెప్పారు. కశ్మీర్‌తోపాటు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారిపై కొందరు దాడులు చేయడం అత్యంత బాధాకరమని, మనందరం ఐక్యంగా ఉండి ఉగ్రవాదాన్ని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. తాను లెఫ్టినెంట్ గవర్నర్‌తో, ముఖ్యమంత్రితో భేటీ అయ్యానని, దాడి గురించి వారు వివరించారని చెప్పారు.

# ఇండియాలో వెంటనే పీవోకేను కలపాలి

ఉగ్రమూకల దాడులను ఖండించారుయ మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుతూ నివాళులర్పించారు. ఈ ర్యాలీ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగించారు. ఉగ్రవాదుల పాశవిక దాడులను ఖండిస్తున్నామని చెప్పారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా ఉండాలంటే భారత ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలన్నారు. రాజకీయాలకు అతీతంగా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు.

**గట్టి జవాబు ఇవ్వాలి - సీఎం రేవంత్ రెడ్డి**

"ఉగ్రవాదంపై భారత ప్రభుత్వం చేపట్టే ప్రతీ చర్యకు మద్దతు పలికేందుకు అందరం సిద్ధంగా ఉన్నాం. అందరం ఏకమై తీవ్రవాదాన్ని అంతమొందించి దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవాలి. దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతున్నాం. ఉగ్రవాద దాడుల్లో మరణించిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం సానుభూతి తెలుపుతోంది. ఆ కుటుంబాలకు అందరం అండగా నిలబడి మనోధైర్యాన్ని ఇవ్వాలని కోరుతున్నాం" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

"ఈ భావోద్వేగ సమయంలో 140 కోట్ల మంది భారత ప్రజలంతా ఒక్కటిగా నిలబడాలి. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవాలి. ఇది రాజకీయాలకు అతీతంగా ఐకమత్యం చాటుకోవాల్సిన సందర్భం. దాడికి బాధ్యులైన వారిని ఉపేక్షించకూడదు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. ఈ విషయంలో భారత ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నాము" అని సీఎం రేవంత్ తెలిపారు.

"1967, 1971 లో ఇలాంటి దాడులు జరిగినపుడు ఇందిరాగాంధీ గట్టి జవాబు ఇచ్చారు. ఒక్క దెబ్బతో పాకిస్తాన్ ను పాకిస్తాన్, బంగ్లాదేశ్ అని రెండు ముక్కలు చేశారు. ఆ సందర్భంలో ఇందిరాగాంధీని వాజ్ పేయ్ దుర్గామాతతో పోల్చారు. ప్రధాని మోడీ గారు మీరు దుర్గామాత భక్తులుగా ఇందిరాగాంధీని ఆదర్శంగా తీసుకోండి. ఉగ్రమూకలకు గట్టి జవాబు ఇవ్వాలి. కోట్లాది భారతీయులంతా మీకు మద్దతుగా ఉంటారు... ఒక్క దెబ్బతో పాకిస్థాన్ ను రెండు ముక్కలు చేయండి. పాక్ ఆక్రమిత కాశ్మీర్ ను భారత్ లో కలపండి" అంటూ సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు.



## ఇస్రో మాజీ చైర్మన్ కస్తూరి రంగన్ కన్నుమూత

- ఆయన సేవలకుగాను పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్ పురస్కారాలు వరించాయి.
- ప్రధాని నరేంద్ర మోదీ నివాళి

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

ఇస్రో మాజీ చైర్మన్ డాక్టర్ కస్తూరి రంగన్ కన్నుమూశారు. గత కొంత కాలంగా వృద్ధాప్య సంబంధిత రుగ్మతలతో బాధపడుతున్న ఆయన బెంగళూరులోని తన నివాసంలో 84 ఏళ్ల వయస్సులో తుదిశ్వాస విడిచారు. "కస్తూరి రంగన్ శుక్రవారం బెంగళూరులోని తన నివాసంలో స్వర్గస్తులయ్యారు. ఏప్రిల్ 27న అంతిమ నివాళులు అర్పించేందుకు ఆయన భౌతిక కాయాన్ని రామన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఆర్ఆర్ఐ) లో ఉంచుతారు" అని అధికారులు తెలిపారు.కస్తూరిరంగన్ గతంలో జేఎన్‌యూ ఛాన్సలర్‌గా, కర్ణాటక నాలెడ్జ్ కమిషన్ ఛైర్మన్‌గా పనిచేశారు. 1994 నుంచి 2003 వరకు ఇస్రో ఛైర్మన్‌గా పనిచేశారు. 200309 మధ్య కస్తూరి రంగన్ రాజ్యసభ సభ్యుడిగా సేవలందించారు. 2004 నుంచి 2009 మధ్య కాలంలో బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్‌కు డైరెక్టర్‌గా ఉన్నారు. మోదీ సర్కార్ తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానం 'ముసాయిదా కమిటీ'కి కస్తూరి రంగన్ అధ్యక్షుడిగా వ్యవహరించారు.

**జీవిత విశేషాలు**

కస్తూరి రంగన్ 1940 అక్టోబర్ 24న కేరళలోని ఎర్నాకులంలో సీఎం కృష్ణస్వామి, విశాలాక్షి దంపతులకు జన్మించారు. ఈయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. రంగన్ తండ్రి తరపు పూర్వీకులు తమిళనాడు నుంచి వలస వచ్చి త్రిస్సూర్ జిల్లాలోని చాలకుడిలో స్థిరపడ్డారు. ఇక కస్తూరి రంగన్ తల్లి పాలక్కడ్ అయ్యర్ కుటుంబానికి చెందినవారు. 2000 సంవత్సరంలో కస్తూరి రంగన్‌కు భారత ప్రభుత్వం పద్మ విభూషణ్ పరస్కారాన్ని ప్రధానం చేసింది.

**కస్తూరి రంగన్ గ్రేట్ అచీవ్‌మెంట్స్**

ఖగోళ భౌతిక శాస్త్రవేత్తగా కస్తూరి రంగన్ హై ఎనర్జీ ఎక్స్‌రే, గామా రే ఆస్ట్రోనమీ, ఆప్టికల్ ఆస్ట్రోనమీపై పలు పరిశోధనలు చేశారు. ముఖ్యంగా కాస్మిక్ ఎక్స్‌రే మూలాలు, సెలస్టియెల్ గామారే, లోవర్ అట్మాస్పియర్‌లో కాస్మిక్ ఎక్స్‌కిరణాల ప్రభావంపై అధ్యయనం చేశారు.

కస్తూరిరంగన్ పీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ అభివృద్ధిలోనూ కీలకపాత్ర పోషించారు. ఆయన చేసిన సేవలకుగాను పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్ పురస్కారాలు ఆయనను వరించాయి.

**మోదీ నివాళి**

కస్తూరి రంగన్‌కి ప్రధాని మోదీ నివాళులు అర్పించారు. 'కస్తూరి రంగన్ ఇస్రోకు ఎంతో శ్రద్ధతో సేవలు అందించారు. భారత అంతరిక్ష కార్యక్రమాలను సరికొత్త శిఖరాలకు నడిపించారు. జాతీయ విద్యా విధానాన్ని రూపొందించినందుకు భారతదేశం ఎల్లప్పుడూ ఆయనకు కృతజ్ఞతతో ఉంటుంది' అని అన్నారు.

## పాకిస్థానీలను గుర్తించి వెంటనే పంపించండి

విశాలభారతి,స్టేట్ బ్యూరో:

జమ్ము కశ్మీర్లోని పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో శుక్రవారం మాట్లాడారు. ఆయా రాష్ట్రాల్లో నివాసం ఉంటున్న పాకిస్థానీ జాతీయలను గుర్తించి తిరిగి వాళ్ల దేశానికి పంపించాలని ఆదేశించారు. వాళ్లు తిరిగి వెళ్లేలా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. గడువు తేదీ ముగిసే వరకు పాకిస్థాన్ జాతీయులు ఉండకుండా చూడాలని కోరారు. తొలుత స్థానికంగా ఉంటున్న పాకిస్థానీయులను గుర్తించి ఆ సమాచారం కేంద్రానికి ఇవ్వాలని, అప్పుడే వారి వీసాల రద్దుకు అవకాశం ఉంటుందన్నారు.

కాగా, ఇప్పటికే పాకిస్థాన్ పౌరులకు జారీ చేసిన వీసా సేవలను నిలిపివేసిన భారత్, ఈనెల 27 వరకూ అన్ని వీసాలు రద్దవుతాయని తెలిపింది. వీసాల గడువు ముగిసేలోగా పాక్ పౌరులంతా భారత్‌ను వీడి వెళ్లాలని చెప్పింది. అయితే, ఈ వీసాల రద్దు అంతుకుముందు పాకిస్థానీ హిందువులకు జారీ చేసిన వీసాలకు వర్తించదని కేంద్రం తెలిపింది. దీంతో పలువురు పాక్ జాతీయులు అటారీ సరిహద్దు ద్వారా భారత్‌ను వీడి వెళ్లిపోతున్నారు. ఆగ్రా తాజ్గంజ్లోని తమ బంధువుల ఇంటికి ఒక నెల వీసాపై వచ్చిన పాకిస్థాన్ పౌరులను పోలీసులు తిరిగి పంపించారు. కరాచీకి చెందిన ఓ కుటుంబం మాట్లాడుతూ తమ బంధువులను కలుసుకునేందుకు 45 రోజుల వీసా గడువుపై భారత్‌కు వచ్చామని తెలిపింది.

గతంలో భారత్ సార్క్ వీసా పొడిగింపు పథకం కింద చాలా మంది పాకిస్థాన్ జాతీయులకు భారత్‌లో పర్యటించే అవకాశం కల్పించారు. ఈ పథకం కింద భారత్‌లో ఉన్న ఎవరైనా సరే 48 గంటల్లో దేశాన్ని వీడాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. కానీ, మెడికల్ వీసాలు పొందిన వారికి మాత్రం ఏప్రిల్ 29వ తేదీ వరకు గడువు ఉంది. కాగా, పాక్ నుంచి కొత్త దరఖాస్తుదారులకు వీసా సర్వీసులను తక్షణమే నిలిపివేశామని విదేశాంగ శాఖ ఇప్పటికే వెల్లడించింది. దీంతోపాటు పాక్‌లో ఉన్న భారత జాతీయులు కూడా తిరిగి వచ్చేయాలని అడ్వైజరీ జారీ చేసింది.

**సింధూ నది జలాల వివాదంపై మీటింగ్**

మరోవైపు సింధూ నది జలాల వివాదంపై తన నివాసంలో అమిత్ షా చర్చించనున్నారు. ఈ సమావేశానికి షాతో పాటు జల్శక్తి మంత్రి సీఆర్ పాటిల్, పలువు ఉన్నతాధికారులు హాజరు కానున్నారు. ఇప్పటికే ఈ ఒప్పందాన్ని రద్దు చేస్తున్నట్లు పాకిస్థాన్ ప్రభుత్వానికి లేఖ రాసినట్లు అధికారులు వెల్లడించారు.



## హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో ఎంఐఎం గెలుపు

(మొదటిపేజీ తరువాయి)

దీంతో ఈ నెల 23న జరిగిన ఎన్నికల్లో మొత్తం 112 ఓట్లకు గానూ 88 ఓట్లు పోలయ్యాయి. బీఆర్ఎస్ మినహా కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎం నుంచి 66 మంది కార్పొరేటర్లు, 21 మంది ఎక్స్ అఫీషియో సభ్యులు ఓటు వేశారు. ఇవాళ జరిగిన ఓట్ల లెక్కింపులో 88 ఓట్లు చెల్లుబాటు అవగా, అందులో 63 ఓట్లు ఎంఐఎం, 25 ఓట్లు బీజేపీకి వచ్చాయి. ముందు నుంచి భావించినట్లుగానే కాంగ్రెస్ మద్దతుతో మరోసారి హైదరాబాద్ ఎమ్మెల్సీ స్థానాన్ని మజ్లిస్ దక్కించుకుంది.ఫలితాలు వెలువడిన అనంతరం బీజేపీ అభ్యర్థి గౌతమ్రావు మాట్లాడారు. తమ కార్పొరేటర్లను ఓటు వేయకుండా అడ్డుకున్న బీఆర్ఎస్ను ఎలక్షన్ కమిషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎంఐఎంకు సహకరించిందని, మజ్లీస్ పార్టీ చెప్పు చేతుల్లో హస్తం పార్టీ పని చేస్తుందని విమర్శించారు. ఈ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్, ఎంఐఎం, బీఆర్ఎస్ ఒక్కటే అనే విషయం అర్థమవుతుందని, తెలంగాణ ప్రజలు ఈ అంశాన్ని అర్థం చేసుకోవాలన్నారు. ఎన్నికల్లో తనకు సహకరించిన పార్టీ నాయకత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## మేడిగడ్డ ఏడో బ్లాక్‌ను తొలగించాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

3 ఆనకట్టలకు సంబంధించి అన్ని అంశాలను విస్తృతంగా అధ్యయనం చేయాలన్న కమిటీ, భవిష్యత్తులో ప్రాజెక్టుల నిర్మాణ సమయంలో, ఆ తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలు సైతం సూచించింది.

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ ఆనకట్ట ఏడో బ్లాక్‌లోని పియర్ కుంగిపోవడంతో పాటు అన్నారం, సుందిళ్ల ఆనకట్టల్లోనూ సమస్యలు తలెత్తడంతో సమగ్ర అధ్యయనం చేసి తగిన సిఫారసులు చేయాలని జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలోని ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ క్షేత్రస్థాయిలో పర్యటించడంతో పాటు ఉన్నతాధికారులతో సమీక్షించి, పలు దఫాలు సమావేశమై నివేదికను రూపొందించింది. రికార్డులు, డిజైన్లు అన్ని అంశాలను పూర్తి స్థాయిలో పరిశీలించింది. నమూనాలు, ఉపగ్రహ ఛాయాచిత్రాలు, వివిధ పరీక్షల ఫలితాలను విశ్లేషించి తగిన సిఫారసులు చేసింది. మేడిగడ్డ ఏడో బ్లాక్‌లో పగుళ్లు ఏర్పడి పియర్స్ దెబ్బతినడం, కుంగడం, అన్నారం, సుందిళ్ల ఆనకట్టల్లో సీపేజ్, ఇతర సమస్యలపై కమిటీ అధ్యయనం చేసింది.

ప్రాథమిక నివేదిక ఇచ్చిన కమిటీ 2024 వర్షాకాల సీజన్‌కు ముందు తాత్కాలిక భద్రతా చర్యలు చేపట్టాలని, సాంకేతిక పరీక్షలు చేయాలని సూచించింది. అయితే వాటిని పూర్తిగా, సమర్థవంతంగా అమలు చేయలేదని కమిటీ ఆక్షేపించింది. సాంకేతిక పరీక్షలు పూర్తి కాకముందే గ్రౌటింగ్ చేయడంతో నిర్దిష్ట కారణాల అంచనాకు ఆటంకం ఏర్పడిందని ఫాలో అప్ డ్రిల్లింగ్ లేకపోవడంతో జీపీఆర్, ఈఆర్‌టీ, భూకంప పరీక్షలు అసంపూర్ణం అయ్యాయని వివరించింది.

ఆనకట్టల డిజైన్ మొదలు నిర్మాణం, నాణ్యత, నిర్వహణ వరకు అడుగడుగునా లోపాలు, ఉల్లంఘనలు ఉన్నాయని నిపుణుల కమిటీ స్పష్టం చేసింది. డిజైన్, హైడ్రాలిక్ నమూనాలు, గేట్ ఆపరేషన్లు సరిగా లేవని ఎనర్జీ డిసిపియేషన్, గేట్ సీట్ పొజిషనింగ్‌లో డిజైన్ లోపాలు ఉన్నాయని పేర్కొంది. మోడల్ స్టడీస్ సరిగ్గా జరగలేదని, హైడ్రాలిక్ స్ట్రక్చరల్ డిజైన్ సరిపోలేదని తెలిపింది. కేంద్ర జలసంఘం పరిశీలనలో డీపీఆర్ ఉండగానే బ్యారేజీల నిర్మాణం ప్రారంభమైందని, ముందస్తు జియోటెక్నికల్ అధ్యయనాలు లేకుండా అన్నారం, సుందిళ్ల ఆనకట్టల నిర్మాణ ప్రాంతాలు, డిజైన్లను మార్చారని పేర్కొంది.

బ్యారేజీల నిర్మాణంలో నీటిపారుదల శాఖ ఉల్లంఘనలకు పాల్పడిందని తేల్చింది. ఆనకట్టల నిర్వహణ, మాన్యువల్‌లు సరిగ్గా లేకపోవడం వల్ల మొదటి ఏడాదిలోనే సమస్యలు తలెత్తాయని మరమ్మతులు సైతం వెంటనే చేపట్టలేదని నిపుణుల కమిటీ తెలిపింది. 2012 డ్యాం సేఫ్టీ చట్టాన్ని ఉల్లంఘించినట్లు స్పష్టం చేసింది. బ్యారేజీలో నిర్వహణ లోపాలు సమస్యలు తెచ్చిపెట్టాయని, డ్యామ్ సేఫ్టీ చట్టాన్ని పాటించకపోవడంతో మరింత పెరిగాయని కమిటీ అభిప్రాయపడింది.

మేడిగడ్డ బ్యారేజీలో పైపింగ్, నాణ్యత లేని సీకెంట్ పైల్ కటాఫ్‌ల కారణంగా ఏడో బ్లాక్ దెబ్బతినట్లు, అన్నారం, సుందిల్లలోనూ బలహీనమైన నిర్మాణం, సరిగ్గా లేని కటాఫ్ గోడల డిజైన్ వల్లే సమస్యలు తలెత్తినట్లు గుర్తించింది. సీకెంట్ పైల్ కటాఫ్స్‌లో నాణ్యత లేకపోవడమే పియర్ కుంగడానికి కారణమన్న కమిటీ నాణ్యతా లోపం వల్లే ఎగువ, దిగువన కటాఫ్ సిస్టంలో వైఫల్యం జరిగిందని స్పష్టం చేసింది. బలహీనమైన ఆర్‌సీసీ, పీసీసీ పైల్స్, రాఫ్ట్ కనెక్షన్, నాణ్యత లేని నిర్మాణం కారణంగా ఇబ్బందులు వచ్చినట్లు పేర్కొంది. డిజైన్, నిర్మాణం సరిగా లేకపోవడం వల్లే సమస్యలు తలెత్తాయని తెలిపింది. అన్ని బ్యారేజీలకు కటాఫ్ వాల్ అంశాలు ఆందోళనకరంగా ఉన్నాయని, బ్యారేజీల్లోనీ ఇతర బ్లాక్‌లలో భవిష్యత్తులో సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. మేడిగడ్డలోని అన్ని బ్లాక్‌లను పూర్తిస్థాయిలో పరీక్షించాలని తెలిపింది. మూడు ఆనకట్టల పరిస్థితిపై సమగ్ర అధ్యయనం అవసరమన్న కమిటీ జియోటెక్నికల్, జియోఫిజికల్, హైడ్రాలిక్, స్ట్రక్చరల్ పరీక్షలు పక్కాగా చేయాలని పేర్కొంది. తక్షణ మరమ్మతులు చేపట్టాలని, మూడు బ్యారేజీలకు సమగ్ర పునర్నిర్మాణ డిజైన్ అవసరమని పేర్కొంది. దీర్ఘకాలిక భద్రత కోసం అన్ని విభాగాలు సమష్టిగా చర్యలు చేపట్టాలని నిపుణుల కమిటీ సూచించింది.

మేడిగడ్డ ఆనకట్ట ఏడో బ్లాక్ పియర్స్‌కు పగుళ్లు, కుంగిన నేపథ్యంలో ఆ నిర్మాణాలను గేట్ల ఆపరేషన్ కోసం ఉపయోగించరాదని కమిటీ సిఫార్సు చేసింది. పక్క బ్లాకులు దెబ్బతినకుండా ఏడో బ్లాకును తొలగించాలని లేదంటే స్థిరీకరించాలని తెలిపింది. దెబ్బతిన్న సీకెంట్ పైల్స్‌ను పునరుద్ధించడం లేదా గ్రౌటింగ్ చేయాలని సూచించింది. నాణ్యత కోసం డయాఫ్రమ్ వాల్ రకాన్ని ఎంచుకోవచ్చని పేర్కొంది.

రాఫ్ట్ కింద ఉన్న గోతులను పూడ్చాలని, ఈ క్రమంలో బ్యారేజీ ఫౌండేషన్ దెబ్బతినకుండా మళ్లీ స్ట్రక్చరల్ అనాలిసిస్ చేయాలని తెలిపింది. ఏడో బ్లాక్ కోసం కొత్త నిర్మాణం, డెక్ స్లాబ్, ఎనర్జీ డిసిపియేషన్ అరేంజ్‌మెంట్ ప్రత్యేకంగా విశ్లేషించాలని పేర్కొంది. అన్నారం, సుందిల్ల బ్యారేజీలకు సైతం నష్టం జరిగినందున వాటి ద్వారా నీటిని మళ్లించడం సురక్షితం కాదని నిపుణుల కమిటీ అభిప్రాయపడింది.

భవిష్యత్తులో ప్రాజెక్టులకు సంబంధించి సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సైతం నిపుణుల కమిటీ నివేదికలో సూచించింది. కాళేశ్వరం లాంటి ప్రాజెక్టులు, బ్యారేజీలు నిర్మించినప్పుడు జియో టెక్నికల్ పరీక్షలు సమగ్రంగా నిర్వహించాలని తెలిపింది. అన్ని కోణాల్లో, అన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని నమూనా అధ్యయనాలు, విశ్లేషణలు పక్కాగా జరగాలని ఖచ్చితమైన సమాచారంతో ప్రక్రియ చేపట్టాలని సూచించింది. ప్రాజెక్టు డిజైన్లు, డేటా విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడరాదని స్పష్టం చేసింది. ప్రాజెక్టు ప్లానింగ్, ఇన్వెస్టిగేషన్స్‌లో సీడీవో పాత్ర లేదని తెలిసిందని, అది సరికాదని వెల్లడించింది. నిర్మాణం జరుగుతున్నప్పుడూ సీడీవో యూనిట్ సహా అన్ని విభాగాలు పూర్తి సమన్వయంతో పనిచేయాలని తెలిపింది. పనుల గడువులను దృష్టిలో ఉంచుకొని ఆమోదించిన నిర్మాణ విధానం విషయంలో ఎట్టి పరిస్థితులను రాజీ పడరాదని పేర్కొంది. నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడొద్దన్న నిపుణుల కమిటీ క్వాలిటీ కంట్రోల్ విభాగం పూర్తి స్వతంత్రంగా ఉండాలి తప్ప ఒకరి కింద పని చేస్తున్న విధానం సరికాదని స్పష్టం చేసింది. క్వాలిటీ కంట్రోల్ విభాగానికి తగిన సిబ్బందిని ఇచ్చి బలోపేతం చేయాలని సూచించింది

## ప్రపంచ శాంతి కోసం 'భారత్ సమ్మిట్-2025'

విశాలభారతి,స్టేట్ బ్యూరో

హైదరాబాద్ వేదికగా ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన 'భారత్ సమ్మిట్ 2025'కి సర్వం సిద్ధమైంది. హెచ్ఐసీసీలో సదస్సు నిర్వహణకు ఏర్పాట్లు చేసిన సర్కార్, దాదాపు 100 దేశాల నుంచి 450 మంది ప్రతినిధులు హాజరవుతారని అంచనా వేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్యం పట్టాలు తప్పుతున్న తీరు, దేశాల మధ్య వాణిజ్య యుద్ధాలు, క్రోనీ క్యాపిటలిజంతో అసమానతలు పుట్టుకొస్తున్న వేళ శుక్రవారం, శనివారం జరిగే భారత్ సమ్మిట్ కీలకం కానుందని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేస్తోంది. శుక్రవారం, శనివారం జరగబోయే సభ ఏర్పాట్లను మంత్రులు, కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, పార్టీ ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పనులను పర్యవేక్షించారు. ప్రతినిధుల సమావేశ మందిరం, కాన్ఫరెన్స్ హాల్, జస్టిస్ హాల్, లిబర్టీ హాల్, ఎక్స్‌పో పాత్ ఆఫ్ జస్టిస్ హాల్, ఫొటో ఎగ్జిబిషన్‌తో పాటు రిసెప్షన్ ఎదురుగా చరఖాపై నూలు వడుకుతున్న మహాత్మా గాంధీ విగ్రహాన్ని తదితర ప్రాంతాలను నేతలు పరిశీలించారు. ప్రపంచ ప్రగతి శీల ఉద్యమాన్ని ప్రారంభించాలనే లక్ష్యంతో 'భారత్ సమ్మిట్ 2025' అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. కాంగ్రెస్ సర్కార్ తొలిసారి నిర్వహిస్తున్న ఈ రాజకీయ సదస్సుకు 100కు పైగా దేశాల నుంచి 450 మందికి మించి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరవనున్నారు. ప్రజా ప్రతినిధులు, నేతలు, నిపుణులు సదస్సులో పాల్గొంటారన్న భట్టి విక్రమార్క, ప్రపంచ న్యాయం, సమానత్వం, ప్రగతిశీల సహకారం తదితర అంశాలపై చర్చిస్తారని వెల్లడించారు. అదేవిధంగా మలేషియా న్యాయశాఖ మంత్రి కులశేఖరన్, అర్జెంటీనా, స్వీడన్ దేశాల విదేశాంగ శాఖ మాజీ మంత్రులు జార్జ్ థయానా, ఆన్లెండే, కొలంబియా కార్మిక శాఖ మాజీ మంత్రి క్లారా లోపెజ్, క్యూబా కమ్యూనిస్టు పార్టీ నేత ఎమిలియో లోజెడా, పలువురు కాంగ్రెస్ నేతలు సదస్సుకు హాజరు కానున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా పట్టాలు తప్పుతున్న ప్రజాస్వామ్యం, దేశాల మధ్య వాణిజ్య యుద్ధాలు, క్రోనీ క్యాపిటలిజంతో పెరుగుతున్న అసమానతలు, పౌర హక్కులను కాలరాస్తున్నారన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. వీటన్నిటి దృష్ట్యా భారత్ మరోసారి ప్రపంచానికి దారి చూపాల్సిన అవసరం ఏర్పడిందని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం ప్రపంచ ప్రగతిశీల ఉద్యమాన్ని ప్రారంభించాలనే లక్ష్యంతో ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వివరించారు. సీఎం రేవంత్‌రెడ్డి అభివృద్ధి విజన్‌ను సదస్సులో వివరించనున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు.

## రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

దేశంలో గత కొన్ని రోజులుగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. భానుడి భగభగలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో హీట్‌వేవ్ గురించి భారత వాతావరణ శాఖ (ఐఎండీ) కీలక అప్డేట్ ఇచ్చింది. దేశంలోని కొన్ని ప్రాంతాల్లో ఏప్రిల్ 30 వరకు హీట్ వేవ్ పరిస్థితులు కొనసాగుతాయని ప్రజలను హెచ్చరించింది. పూర్తి వివరాల్లోకి వెళితే..

తెలంగాణలో విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొంటున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు భీకరమైన ఎండలు, ఉక్కపోత, వేడి గాలులు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే.. వడదెబ్బకు చాలా మంది పిట్టల్లా రాలిపోతున్న భయంకర పరిస్థితి నెలకొంది. ఓవైపు భానుడు నిప్పుల వర్షం కురిపిస్తుంటే.. మరోవైపు పలు ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తూ బీభత్సం సృష్టిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే.. తెలంగాణ వెదర్ మ్యాన్ మరో హెచ్చరికను మోసుకొచ్చాడు.

మెదక్ పరిసర ప్రాంతాలైన సిద్దిపేట, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో రానున్న కొద్ది గంటల్లో భీకర వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలంగాణ వెదర్ మ్యాన్ అంచనా వేశాడు. ఈరోజు (ఏప్రిల్ 25వ) సాయంత్రం నుంచే ఈ ప్రాంతాల్లో వాతావరణం వేగంగా మారుతోందని తెలుపగా.. అందుకు అనుగుణంగా ఇప్పటికే ఆయా చోట్ల వర్షం కూడా మొదలైనట్టు తెలుస్తోంది..

అధిక ఉష్ణోగ్రతల కారణంగా వాతావరణం అస్థిరంగా మారడంతో.. రాబోయే రెండు గంటల్లో ఈ ప్రాంతాల్లో బలమైన ఈదురు గాలులతో పాటు పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయని తెలంగాణ వెదర్ మ్యాన్ హెచ్చరించాడు. ఇక హైదరాబాద్ నగరంలో.. సాయంత్రం 7 గంటల వరకు పొడి వాతావరణం కొనసాగే అవకాశం ఉందని వెదర్ మ్యాన్ అంచనా వేశారు. అయితే.. మెదక్ ప్రాంతంలో కురిసే వర్షాల ప్రభావం హైదరాబాద్ మీద కూడా పడే అవకాశం ఉందని వెదర్ మ్యాన్ అంచనా వేస్తున్నాడు. రాత్రి వేళల్లో హైదరాబాద్‌లో కూడా బలమైన గాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని చెప్తున్నాడు.



హైదరాబాద్, మెదక్ ప్రాంతాల ప్రజలు రాబోయే కొద్ది గంటల్లో వాతావరణంలో చోటుచేసుకునే భారీ మార్పులను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని,సురక్షితమైన ప్రదేశాల్లో తలదాచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా బలమైన గాలులు వీచే సమయంలో చెట్ల కింద లేదా విద్యుత్ స్తంభాల దగ్గర ఉండరాదని సూచిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు రావాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రయాణాలు చేసేవాళ్లు ఈ వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## బార్డర్‌లో టెన్షన్

మరోవైపు పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో జమ్ముకశ్మీర్‌లో భద్రతను కట్టుదిట్టం చేసింది భారత సైన్యం. ఉగ్రవాదుల ఏరివేత కోసం విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా బందిపోరా జిల్లాలో భద్రతా దళాలు ఉగ్రవాదుల మధ్య ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. బందిపోరా జిల్లాలోని కుల్నార్ బాజీపోరా ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నారన్న సమాచారంతో భద్రతా దళాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఉగ్రవాదులు భద్రతా సిబ్బందిపై కాల్పులు జరపడంతో గాలింపు చర్యలు ఎన్‌కౌంటర్‌గా మారాయని అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ఇప్పటి వరకు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు వెల్లడించారు. కాగా.. జమ్ముకశ్మీర్‌లోని ఉధంపూర్ జిల్లాలో గురువారం ఉగ్రవాదులతో జరిగిన ఎదురుకాల్పుల్లో భారత ఆర్మీ ప్రత్యేక దళాలకు చెందిన జవాను మృతి చెందాడు. ఉగ్రవాదులు ఉన్నారన్న సమాచారంతో చేపట్టిన కార్డన్ సెర్చ్ ఆపరేషన్‌లో దుదుబసంత్ గఢ్ ప్రాంతంలో ఈ ఘటన జరిగిందని అధికారులు ఒక ప్రకటనలో వెల్లడించారు.

**వైష్ణోదేవి ఆలయం వద్ద భారీగా భద్రతా ఏర్పాట్లు..**

పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో కత్రాలోని మాతా వైష్ణోదేవి ఆలయం వద్ద భద్రతను కట్టుదిట్టం చేసినట్టు అధికారులు వెల్లడించారు. భద్రతను పెంచామని, అప్రమత్తంగా ఉన్నామని రియాసి సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ పరమ్ వీర్ సింగ్ తెలిపారు. భద్రతను నిర్ధరించడానికి ర్యాండమ్ చెకింగ్ సహా అందుబాటులో ఉన్న అన్ని వనరులను ఉపయోగిస్తు వనరుల్లోనే మేము ప్రతిదీ చేస్తున్నాము.

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

శనివారం,
26.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com





## ప్రణాళికాబద్ధంగా పటాన్ చెరు డివిజన్ అభివృద్ధి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- రూ.5 కోట్ల 40 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**పటాన్ చెరు,విశాలభారతి**

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్చెరు డివిజన్ ను అభివృద్ధికి ప్రతీకగా తీర్చిదిద్దుతున్నామని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని బండ్లగూడ నేతాజీ నగర్, సీతారామయ్య కాలనీ, గోకుల్ నగర్, తదితర కాలనీలలో ఐదు కోట్ల 40 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నూతనంగా ఏర్పాటవుతున్న కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. ప్రధానంగా సిసి రోడ్లు, పార్కులు, అంతర్గత మరుగు నీటి కాలువలు, విధి దీపాలు ఏర్పాటుకు కృషి చేస్తున్నామని తెలిపారు. వీటితో పాటు మరో రెండు కోట్ల రూపాయల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమాలలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నరసింహా రెడ్డి, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఉగ్ర దాడికి నిరసనగా క్రొవొత్తుల ర్యాలీ



**పటాన్ చెరు,విశాలభారతి**

కాశ్మీర్ లో జరిగిన ఉగ్ర దాడికి నిరసనగా పటాన్ చెరు డివిజన్ పరిధిలోని ఏపీఆర్ కాలనీ వాసులు గురువారం రాత్రి క్రొవొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఇలాంటి చర్యలు ఇక ముందు జరగకుండా కేంద్ర ప్రభుత్వం గట్టిగా జవాబు చెప్పాలన్నారు. మృతులకు శాంతి చేకూరాలనీ, వారి కుటుంబాలకు ధైర్యం ప్రసాదించే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు ఎర్ర బాబురావు, అనురాధ, పుష్ప, రామేశ్వరమ్మ, మౌనిక, వసుందర, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

# సరూర్నగర్ సర్కిల్లో.. అక్రమ నిర్మాణాల జోరు

- తూతూ మంత్రంగా నోటీసులు
- మరి కూల్చివేతలేప్పుడు?
- జిహెచ్ఎంసి ఆదాయానికి భారీ గండి.





**ఎల్బీనగర్ , విశాలభారతి:**

అక్రమ కట్టడాలకు సరూర్నగర్ సర్కిల్ ప్రాంతం అడ్డాగా మారింది. ఎటువంటి అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణాలకు తోడుగా అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారు. సంబంధిత సరూర్నగర్ సర్కిల్ టౌన్ప్లానింగ్ అధికారులకు మామూళ్లు అందిస్తే చాలు అటువైపు కన్నెత్తి కూడా చూడరు. ఒకవేళ మామూళ్లు ఇవ్వకుంటే మాత్రం కన్నెర్ర చేస్తారు..ఎక్కడ లేని నిబంధనలను అమలు చేసేందుకు చేయని ప్రయత్నాలు ఉండవు. వారికి రావాల్సిన మామూళ్లు అందిస్తే శాంతిస్తారు. ఈ క్రమంలోనే కొత్తపేట డివిజన్ పరిధిలోకి వచ్చే కామినేని హాస్పిటల్ ఎదురుగా బాలాజీ మెస్ పక్కన రహదారి పక్కనే చేపట్టిన భారీ వాణిజ్య షెడ్డు నిర్మాణం విమర్శలకు తావిస్తున్నది. అయితే అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు, జోనల్ అక్రమ నిర్మాణాల నిరోధక ప్రత్యేక అధికారి, సర్కిల్ టౌన్ప్లానింగ్ సీపీ, ఏసీపీ, ఎఎంసీ తదితరులు ఏమీ చేస్తున్నారు? అంటే ఎక్కడా సమాధానం లేదు. ఈ విషయాలపై ఉక్కుపాదం మోపాల్సిన ఎల్బీనగర్ జెడ్సీ హేమంత్ పాటిల్ నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇక అక్రమ నిర్మాణాల జోరు పెరిగిందని.. అంతేకాకుండా ఒక్కో నిర్మాణదారుని నుంచి భారీగానే దండుకుంటూ ఆక్రమ నిర్మాణాలకు ఊతమిస్తున్నట్లు విమర్శలున్నాయి. ఈ ఆక్రమ షెడ్డు నిర్మాణాన్ని కూల్చివేసి, ఎల్బినగర్ జోనల్ కమిషనర్ , సరూర్నగర్ ఏసీపీ, టౌన్ ప్లానింగ్ సిబ్బంది తదితరులు అక్రమ వాణిజ్య షెడ్ పై చిత్త శుద్ధి చాటుకోవాల్సి ఉన్నది. అయితే ఏం చేస్తారో చూద్దాం?

**సరూర్నగర్ టౌన్ ప్లానింగ్ అధికారి ఏసిపి ని వివరణ కోరగా...**

సరూర్నగర్ సర్కిల్ కొత్తపేట డివిజన్ కామినేని ఎదురుగా చేపట్టిన షెడ్డు నిర్మాణం విషయంలో సరూర్నగర్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ ని వివరణ కోరేందుకు ప్రయత్నించగా. ఆ షెడ్డు నిర్మాణానికి తాము ఎటువంటి అనుమతి ఇవ్వలేదని స్పష్టం చేశారు. తాము నోటీసులు మాత్రమే ఇచ్చామని తెలిపారు.

(కథనం 2 రేపటి సంచికలో.).




## పాకిస్తాన్ ఉగ్రవాదులను ఉరితీయాలి

- కేంద్రం నిర్ణయానికి ముస్లింల మద్దతు
- ఇస్నాపూర్ చౌరస్తాలో ముస్లింల నిరసన
- నల్ల బ్యాడ్జిలతో జుమ్మా నమాజ్

**పటాన్ చెరు,విశాలభారతి:**

కాశ్మీర్ రాష్ట్రం పహల్గాంలో నరమేధానికి పాల్పడిన ఉగ్రవాదులను పట్టుకుని నరికి శవాలను కుక్కలకు, కాకులకు వేయాలని ఇస్నాపూర్ మస్జీద్ఏ ఇబ్రాహీం మౌలానా ముఫ్తి సయ్యద్ అబ్దుల్ రహ్మాన్, మైనారిటీ నేత ఎండి.మెరాజ్ ఖాన్ అన్నారు. శుక్రవారం పటాన్ చెరు మండలం ఇస్నాపూర్ చౌరస్తాలో మైనార్టీ సీనియర్ నాయకులు మెరాజ్ ఖాన్, ముస్లిం మతపెద్దల ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో ప్రార్ధనలకు వచ్చిన ముస్లింలు పహల్గాం దారుణాన్ని నిరసిస్తూ నల్లరిబ్బన్లు చేతికి ధరించి జుమ్మా ప్రార్ధనలు చేశారు.అనంతరం వారు హిందుస్థాన్ జిందాబాద్ అంటూ నినాదాలు చేస్తూ జాతీయ జెండాలతో, ప్లకార్డులతో తీవ్రవాద వ్యతిరేక నిరసన కార్యక్రమం నిర్వహించి, పాకిస్థాన్ వ్యతిరేక నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మసీదు మౌలాన అబ్దుల్ రెహ్మాన్, మెరాజ్ ఖాన్ మాట్లాడుతూ తీవ్రవాదాన్ని భారతీయ ముస్లింలు అంగీకరించరన్నారు. హిందు సోదరులను మతంపేరున పహల్గాంలో దారుణంగా చంపడం సిగ్గుచేటన్నారు, మానవత్వానికి మచ్చ అన్నారు. పాకిస్థాన్ ప్రేరేపిత తీవ్రవాదులు దేశంలోని హిందు, ముస్లింల మధ్య చిచ్చు రేపుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకునే అన్ని కఠిన చర్యలను ముస్లింలు స్వాగతిస్తారని వారు తెలిపారు. ఈ దారుణానికి పాల్పడిన ఉగ్రవాదులను ప్రపంచంలో ఏ మూల దాక్కున్న ప్రధాని వదలవద్దని, పట్టుకుని ఢిల్లీ నడిబొడ్డున ఉరితీయాలని కోరారు. వారి శవాలను కుక్కలకు, కాకులకు పారవేయాలని డిమాండ్ చేశారు. తీవ్రవాదులను తాము దేశంలోని ఏ ముస్లిం స్మశానవాటికలో ఖననం చేయనీయమన్నారు. ప్రపంచంలోని గొప్పదేశాల్లో మనదేశం అగ్రస్థానంలో ఉంటుందని స్పష్టం చేశారు. పాకిస్థాన్ తో యుద్ధం చేస్తే ముస్లింలు కేంద్ర ప్రభుత్వానికి మద్దతుగా నిలుస్తారన్నారు. పహల్గాం దారుణాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఉగ్రవాదులను పట్టుకుని ఉరితీయాలని కోరారు. తీవ్రవాదుల దాడిలో మరణించిన హిందు సోదరుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తున్న పాకిస్థాన్ పై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకొని గుణపాఠం నేర్పాలని కోరారు. భారత ప్రభుత్వానికి, సైన్యానికి మద్దతుగా తాము ఉంటామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆబెద్, మునీరుద్దీన్, నాసర్, కలీం, బాసిత్, మీర్ మోహియుద్దీన్, ఇంత్యాజ్, అన్వర్, మస్తాన్, గౌస్, అజీజ్, ఫయాజ్, నసీర్, సోఫి, గౌస్, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.



## పాకిస్తాన్ తగిన మూల్యం చెల్లించుకోవాలి

- బిజెపి బౌద్ధనగర్ డివిజన్ అధ్యక్షులు సాయి ప్రసాద్ గౌడ్

**సికింద్రాబాద్,విశాలభారతి :**

జమ్మూ కాశ్మీర్లోని పహల్గామ్లో జరిగిన ఉగ్రవాద గాడిని తీవ్రంగా ఖండిస్తు బౌద్ధ నగర్ లో శాంతిర్యాలీ నిర్వహించారు. మృతుల ఆత్మలు శాంతించాలని భగవంతుని కోరారు. బౌద్ధనగర్ నుండి వారాసిగుడ చౌరస్తా వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం సాయి ప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ ఈ ఘటనలో ఇప్పటివరకు 29 మందికి పైగా మరణించడం మతం అడిగి చంపడం బాధాకరమని సాయి ప్రసాద్ గౌడ్ పేర్కొన్నారు. పాకిస్తాన్ జమ్మూ కాశ్మీర్లో ప్రేరేపిస్తున్న ఈ ఉగ్రదాడులను భారత్ సమర్ధవంతంగా ఎదుర్కొని తగిన బుద్ధి చెబుతుందని సాయి ప్రసాద్ గౌడ్ హెచ్చరించడం జరిగింది ఈ ఉగ్రదాడికి పాకిస్తాన్ తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూ కాశ్మీర్లో శాంతి విరసిల్లి పర్యాటకం ఎంతో అభివృద్ధి చెందిందని, దీంతో జమ్ము కాశ్మీర్ ప్రజలు ఎంతో ఆనందంగా జీవిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. జమ్మూ కాశ్మీర్ ప్రజలు శాంతియుతంగా ఆనందంగా జీవించడం జీర్ణించుకోలేని పాకిస్తాన్ ఈ ఉగ్రదాడులకు ప్రేరేపించిందని ఆయన విమర్శించారు. కార్గిల్ యుద్ధంలో పాకిస్తాన్ కి బుద్ధి చెప్పి పుల్వామా వంటి ఉగ్ర దాడులను కూడా భారత్ సమర్ధవంతంగా ఎదుర్కొందని ఆయన వెల్లడించారు. పాకిస్తాన్ తన తీరు మార్చుకోకపోతే భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. ఇలాంటి చర్యలను భారత ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని తగిన విధంగా బుద్ధి చెబుతుందని సాయి ప్రసాద్ గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వర్ రెడ్డి,కనకట్ల హరి,భాస్కర్ గిరి,మద్దెర్ల శామ్ సుందర్, దత్తు, కొమరయ్య, సత్యనారాయణ. అజయ్, చైతన్య, నగరపు శామ్, సంపత్, కుమార్, లడ్డు, ఓములు, తదితర డివిజన్ నాయకులు పాల్గొన్నారు.



## పార్ట్ టైం అధ్యాపకుల ఉద్యోగ భద్రతకై వంటా వార్పు

**విశాలభారతి,ఓయూ :**

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో పని చేస్తున్న పార్ట్ టైం అధ్యాపకులు అందరూ తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ యూనివర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ ఎదుట శుక్రవారం వంట వార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనేక సంవత్సరాలుగా యూనివర్సిటీలచే శ్రమ దోపిడికి గురైన తమకు, కనీసం జీవో నెంబర్ 21 లో కూడా వెయిటేజ్ ఇవ్వకపోవడం శోచనీయమంటూ, అతి తక్కువ వేతనానికి పనిచేసి, తమ విలువైన సమయాన్ని వెచ్చించిన పార్ట్ టైం అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించకుండా బజారున పడేయాలని చూస్తున్న యూనివర్సిటీ మరియు ప్రభుత్వ విధానాలను వ్యతిరేస్తూ వ్యతిరేకిస్తూ ఈ కార్యక్రమానికి వివిధ ప్రజాసంఘాల, పార్టీల నాయకులను, ప్రొఫెసర్లను ఆహ్వానించారు.

తమకు వెంటనే యూనివర్సిటీల సూపర్ న్యూమోరీస్ కోటాతో ఉద్యోగ భద్రత కల్పించి, తదనంతరం నోటిఫికేషన్కు పోవాలని విజ్ఞప్తి చేస్తూ నిరవధిక సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. నాలుగో రోజు సమ్మెకు ప్రొ. చింతాబట్ల శ్రీనివాస్, టిఎన్ఎన్ అధినేత పృధ్వీరాజ్ యాదవ్, కాసం వెంకటేశం, రుద్రవరం లింగ స్వామి, గాద వెంకట్, ఉదయ్, ప్రజాపతి సత్యనారాయణ, తదితరులు మద్దతు తెలుపుతూ న్యాయమైన డిమాండ్ పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉండి న్యాయం చేకూర్చాలని తెలిపారు. సుదీర్ఘకాలం ప్రభుత్వాలు నోటిఫికేషన్ పట్ల దృష్టి పెట్టని కారణంగానే ఇర్ రెగ్యులర్ అపాయింట్మెంట్స్ నెలకొన్నాయని, ఆ సమస్యను పరిష్కరించే బాధ్యత ప్రభుత్వంపైనే ఉందని వివరించారు. ఈ సమస్య పట్ల ప్రజా ఆందోళనలు మొదలయ్యే ముందే ప్రభుత్వం బాధ్యతగా మెదులుకోవాలని హితవుపాలికరు.కార్యక్రమంలో పార్ట్ టైమ్ అధ్యాపకులు పాల్గొన్నారు.



## సరోజనమ్మ గుట్ట అభివృద్ధికి ప్రణాళిక

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు,విశాలభారతి;**

పటాన్ చెరు నియోజకవర్గ తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని వెలిమెల గ్రామ పరిధిలోగల సరోజనమ్మ గుట్ట అభివృద్ధికి ప్రణాళిక రూపొందించినట్లు పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం వివిధ శాఖల అధికారులు, స్థానిక మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులతో కలిసి సరోజినమ్మ గుట్టను పరిశీలించారు. ప్రధానంగా గుట్టపై భక్తుల సౌకర్యార్థం మౌలిక వసతులతో పాటు, ప్రహరీ గోడ, సిసి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. జీర్ణోద్ధారణ దశలో ఉన్న ఏడు దేవాలయం సైతం పునర్నిర్మించనున్నట్లు తెలిపారు. గుట్ట అభివృద్ధి కోసం సింహ అసోసియేట్స్ సంపూర్ణ సహకారం అందిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, రామచంద్రాపురం తహశీల్దార్ సంగ్రంరెడ్డి, మాజీ కౌన్సిలర్లు పట్లోళ్ల రవీందర్ రెడ్డి, సుచరిత కొమరయ్య, సింహ అసోసియేట్స్ చైర్మన్ నరసింహ, స్థానికులు పాల్గొన్నారు.

## సిపిఐ మండల మహాసభను విజయవంతం చేయండి

- హాజరుకానున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి
- సీపీఐ మండల కార్యదర్శి ఆదరి శ్రీనివాస్.



**విశాలభారతి, భీమదేవరపల్లి :**

మే 5 న, ముల్కనూర్ లో నిర్వహించే సిపిఐ 8 వ, మండల మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి ఆదరి శ్రీనివాస్ కోరారు. శుక్రవారం ముల్కనూర్ అంబేద్కర్ చౌరస్తాలో మహాసభల కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆదరి శ్రీనివాస్ మాట్లాడుతూ, మండల వ్యాప్తంగా భూపోరాటంలో పాల్గొన్న అర్హులైన పేదలకు ఇండ్ల కింద పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు కట్టి ఇవ్వాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం స్వామినాథన్ కమిషన్ అమలు చేసి రైతులకు న్యాయం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు మంచాల రమాదేవి, కొంగల రామచంద్రారెడ్డి, ఆదరి రమేష్, సన్నీల రవి, మార్పు కృష్ణారెడ్డి, సుంచు కుమారస్వామి పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన చీర్యాల లక్ష్మీనరసింహస్వామి వారి సప్తదశ 17వ వార్షిక బ్రహ్మోత్సవాలు



**కీసర,విశాలభారతి:**

చిర్యాల్ శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి సప్తదశ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభం అయ్యాయి.ఈ వార్షిక బ్రహ్మోత్సవాలకు మాజీ మంత్రి మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ముక్య అతిథిగా విచ్చేశారు.రెండోవ రోజు ద్వాదశి ఉదయం నవ కలశాభిషేకం విష్వక్సేన పూజ అగ్ని ప్రతిష్ఠతతో శ్రీ సుదర్శన్ నరసింహం హోమం వేద పండితుల మంత్రోచ్చనలతో ఆలయ చైర్మన్ మల్లరపు లక్ష్మీ నారాయణ పూజ కార్యక్రమాలు చేసి బ్రహ్మోత్సవాలు ప్రారంభించారు. స్వామి వారి దర్శించుకున్న పలువురు రాజకీయ ప్రముకులు వీరిని ఆలయ సంప్రదాయ ప్రకారం పూర్ణకుంభంతో చైర్మన్ స్వాగతం పలికారు. రామగుండం ఎమ్మెల్యే మాఖన్ సింగ్,రాజ్ ఠాకూర్ సతీమణి మనాలి ఠాకూర్,ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి,కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్,మాజీ మంత్రి సినీ నటుడు బాబు మోహన్,మాజీ మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఏం వి రెడ్డి తదితరులు స్వామి వారిని దర్శించుకున్నరూ అనంతరం ఆలయ మండపంలో స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయం ప్రధాన గోపురం పక్కన ఏర్పాటు చేసిన మండపంలో నేడు స్వామి వారి తీరు కళ్యాణం వేడుకలు ఘనంగా జరుగుతాయి.ఈ కళ్యాణిని చూడడానికి చుట్టుపక్కల ఉన్న గ్రామాల ప్రజలు ప్రజాప్రతినిధులు చాలా వరకు రానున్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శనివారం,
26.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com





## కాలనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

- ఓయూ భూగోళ శాస్త్ర వర్కుషాప్ కి విశేష స్పందన

**విశాలభారతి, ఓయూ:**

ఓయూ భూగోళ శాస్త్ర విభాగం "క్రౌడ్ సోర్సింగ్ & క్యూ జిఐఎస్" అనే అంశంపై రెండు రోజుల జాతీయ వర్క్‌షాప్ 2025 ను శుక్రవారం ఈ వర్క్‌షాప్ సెప్టెంబర్ ఓయూ భూగోళశాస్త్ర విభాగం సెమినార్ హాల్‌లో ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమానికి గౌరవ ముఖ్య అతిథిగా భారత రిటైర్డ్ సర్వేయర్ జనరల్ డాక్టర్ స్వర్ణ సుబ్బారావు హాజరయ్యారు. అతిథిగా సైన్స్ ఫ్యాకల్టీ డీన్ ప్రొఫెసర్ డి. కరుణ సాగర్, జిఎస్ఐ డైరెక్టర్ రవి కుమార్ పాల్గొన్నారు. ఓయూ భూగోళ శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ టి. అనురాధ ఈ వర్క్ షాప్ చైర్మన్ గా, ఈ వర్క్ షాప్ కన్వీనర్ గా ప్రొ.బి. శ్రీనగేష్ వ్యవహరించగా, భూగోళ శాస్త్ర సీనియర్ ప్రొ. బాలకిషన్,డాక్టర్ సుదర్శన్, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ వీణ, డాక్టర్ ఇందిర పిజి విద్యార్థులు హాజరయ్యారు. ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం రిసోర్స్ పర్సన్ల ఆధ్వర్యంలో సాంకేతిక సెషన్లను నిర్వహించారు 1. వి. రవి కుమార్, కార్యదర్శి, ఓస్ జియో, ఇండియా, డైరెక్టర్, జిఎస్ఐ శిక్షణ సంస్థ. 2. ప్రొఫెసర్ కె.ఎస్. రాజన్, ట్రెజరర్, ఓఎస్ జియో, 3.ఎస్. రామమూర్తి, ఓఎస్ జియో ఇండియా, డైరెక్టర్ రిటైర్డ్ జిఎస్ఐ, హైదరాబాద్. రెండవ రోజు ఓపెన్ సోర్స్ GIS సాంకేతిక శిక్షణ, అనుభవపూర్వక శిక్షణ ఇచ్చారు. సాయంత్రం వ్యాలీడిక్టరి సెషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిజిస్ట్రార్ ప్రొ. నరేష్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు, ప్రొ. కె.ఎస్. రాజన్ గౌరవ అతిథిగా హాజరయ్యారు.ముఖ్య అతిథి రిజిస్ట్రార్ మాట్లాడుతూ కాలానుగుణంగా మనము మారుతూ ఉండాలి మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేత పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలి. ప్రస్తుతం మార్కెట్లో ముఖ్యమైనటువంటి క్రౌడ్సోర్సింగ్ టెక్నాలజీ పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.

## జిల్లా జడ్జి ని కలిసిన కలెక్టర్

**ఆర్మూర్,విశాలభారతి;**



నిజామాబాద్ జిల్లా జడ్జిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన జిల్లా న్యాయమూర్తి జి.వి.ఎన్ భారత లక్ష్మి ని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శుక్రవారం జిల్లా న్యాయస్థానాల సముదాయ భవనంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జిల్లా జడ్జి ఛాంబర్లో జడ్జికి పూల మొక్కను అందించారు. జిల్లా స్థితిగతులపై ఇరువురు కొద్దిసేపు చర్చించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చేపట్టెల్ కార్యక్రమాలకు జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహకారం అందిస్తామని కలెక్టర్ తెలిపారు.

# తెలంగాణ ద్రోహి కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

- 23 ఏళ్ల ఉద్యమ సేవకు ప్రత్యక్ష అవమానం
- రాజేంద్ర కుమార్ గుండమల్ల ఆవేదన

**కూకట్ పల్లి, విశాలభారతి:**



తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 2004 నుంచి 2023 వరకూ పార్టీ కోసం శ్రమించిన నన్ను నా నియోజకవర్గంలో ఎమ్మెల్యే మర్చిపోయారని ఉద్యమకారుడు కూకట్పల్లి గ్రామ నివాసితుడు రాజేంద్ర కుమార్ గుండమల్ల ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మీడియాకి పత్రికా ప్రకటన విడుదల చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సమితిలో 19 సంవత్సరాల పాటు సేవలందించిన తాను చిన్న కార్యకర్తగా రాజకీయల్లో 2018లో అడుగు పెట్టి కొంగరకలాన్‌లో జరిగిన ప్రగతి నివేదన సభ విజయవంతం అయిన నేపథ్యంలో అదే ఏడాది సెప్టెంబర్ 4న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ అధికార నివాసంలో మంత్రి కేటీఆర్‌తో కలిసి భోజనం చేసిన స్థాయికి ఎదిగానని ఆయన గుర్తు చేశారు. కానీ ఉద్యమ సమయంలో జై తెలంగాణ అనే నినాదాన్ని కూడ పలకని వారు, తెలంగాణ విభజనను వ్యతిరేకించిన వారు కూకట్పల్లి నియోజకవర్గానికి నాయకులవడమంటే ఇదే విచిత్రమని ఆయన తన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న మాధవరం కృష్ణారావు తెలంగాణ ఉద్యమం సమయంలో సమైక్యాంధ్ర శక్తులకు మద్దతు ఇచ్చారని కానీ ఇప్పుడు ఉద్యమ వీడియోల్లో తన ఫోటో పెట్టుకొని ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. కూకట్పల్లి నియోజకవర్గంలో మొత్తం 9 డివిజన్లు ఉన్నా, కేవలం బాలానగర్ డివిజన్ నుంచే ఒక ఉద్యమకారుడికి మాత్రమే కార్పొరేటర్ టికెట్ ఇవ్వడాన్ని గుండమల్ల రాజేంద్ర కుమార్ తప్పుపట్టారు. మిగిలిన డివిజన్లలో ఉద్యమ సైనికులకు ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ఉద్యమకారులకు పార్టీ పదవులు, నామినేషన్ పదవులు ఇవ్వడంలో ఎమ్మెల్యే పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు.

**బావమరిది టికెట్.. వ్యాపారదారికి ప్రాధాన్యత:**

కూకట్పల్లి 121 డివిజన్‌లో ఉద్యమం లో భాగం కాని వ్యాపారవేత్త అయిన తన బావ మరిది గారికే కార్పొరేటర్ టికెట్ ఇచ్చి గెలిపించుకోవడమంటే ప్రజా సంక్షేమం కన్నా కుటుంబ రాజకీయాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు భావించాలన్నారు.

**ఇప్పుడు ఉద్యమ వీడియోలతో నాటకం:**

ఉద్యమం సమయంలో తెలంగాణ ఉద్యమానికి ప్రత్యర్థిగా ఉన్న ఎమ్మెల్యే ఇప్పుడు సోషల్ మీడియాల్లో ఉద్యమ వీడియోలు పోస్ట్ చేసి, అందులో తన ఫోటోలు జోడించి సెంటిమెంట్ క్యాచ్ చేసుకోవడం రాజకీయ వంచనగా అభివర్ణించారు. ప్రజల కళ్లను మాయచేసే ప్రయత్నాలేవి దీర్ఘకాలం సాగవని హెచ్చరించారు. ఉద్యమానికి నిజంగా సేవ చేసినవారిని గుర్తించని రాజకీయ వ్యవస్థపై నిరాశ చెందుతున్నా. కానీ న్యాయమైన పోరాటం మాత్రం ఆగదన్నారు. తెలంగాణ ప్రజలు ఇలాంటి దొరల అసలైన స్వరూపాన్ని గుర్తించే రోజు దగ్గరలో ఉందిని గుండమల్ల రాజేంద్ర కుమార్ పునరుద్ఘాటించారు




## పేటలో కార్మిక శాఖ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

**సూర్యాపేట,విశాలభారతి**

వేసవి కాలంలో కార్మికుల, ప్రజల దాహార్తిని తీర్చడానికి కార్మిక శాఖ శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వాణిజ్య భవన్ వద్ద చలివేంద్రంను అసిస్టెంట్ లేబర్ కమిషనర్ అరుణ ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు పాల్గొని మాట్లాడుతూ వేసవిలో విపరీతంగా ఎండలు ఉంటున్నాయని వీటి నుండి ప్రజలు, కార్మికులు వడ దెబ్బ నుండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. బిల్డింగ్ ఓనర్లు, పరిశ్రమల యాజమాన్యాలు ఉదయం, సాయంత్రం పూట మాత్రమే పనులు చేయించాలని, మధ్యాహ్నం వేళలో పనులు చేయించకూడదని సూచించారు. కార్మికులు నీటిని, మజ్జిగను, పండ్ల రసాలను ఎక్కువగా తీసుకోవాలని, కూల్ డ్రింక్స్ తీసుకోవద్దని తెలియజేశారు. పారిశ్రామిక ప్రాంతాల్లో కూడా స్వచ్ఛంద సంస్థల వారు కార్మికులకు చల్లని త్రాగు నీరు, పానీయాలు అందించే విధంగా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎల్ఓ రాజు, వెంకట నరసయ్య,సందీప్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, ఐఎఫ్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య, సిఐటియు జిల్లా అధ్యక్షులు రాంబాబు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఎలక సోమయ్య, ఐ ఎఫ్ టి యు జిల్లా నాయకులు సామ నర్సిరెడ్డి, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

## రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

- బిఆర్ఎస్ జిల్లా నాయకులు మాజీ సర్పంచ్ చిక్కుల సంపత్.

**సైదాపూర్ , విశాలభారతి:**



ఈనెల 27 న వరంగల్ జిల్లా ఎలుకతుర్తిలో జరిగే బీ ఆర్ ఎస్ రజతోత్సవ సభ ను విజయవంతం చేయాలని బీ ఆర్ ఎస్ జిల్లా నాయకులు ఎగ్లాస్పూర్ మాజీ సర్పంచ్ చిక్కుల సంపత్ విలేకరుల సమావేశంలో తెలిపారు.ఈనెల 27న ఎలుకతుర్తిలో జరిగే బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేయాలని టిఆర్ఎస్ కార్యకర్తలు కోరారు. మండలంలోని అన్ని గ్రామాలు, లోని అన్ని వార్డుల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త ఈ సభ విజయానికి బాధ్యత తీసుకోవాలని, నాయకత్వం నిరూపించుకోవాలని అన్నారు.

## సిల్వర్ జూబ్లీతో కాంగ్రెస్ ఖతం

- కేసిఆర్ గళం బలం బలగం తెలంగాణే
- ఏడాదిన్నర పాలనతో ఆగమైన తెలంగాణ
- కేసిఆర్ కం బ్యాక్ అంటున్న తెలంగాణ ప్రజలు
- ముల్కనూరు పట్టణ అధ్యక్షులు శనిగరం సదానందం

**విశాలభారతి,భీమదేవరపల్లి:**



వరంగల్ జిల్లాలో ఈ నెల 27న, తలపెట్టిన బీ ఆర్ఎస్ రజతోత్సవ సభతో కాంగ్రెస్ ప్రభుత్వానికి వణుకు మొదలైందని,స్థానిక సమరంలో కాంగ్రెస్ పార్టీ ఖతం అవుతుందని ఆ పార్టీ ముల్కనూర్ పట్టణ అధ్యక్షులు శనిగరం సదానందం పేర్కొన్నారు. ఏడాదిన్నర కాలంలోపే కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని అన్నారు. కేసీఆర్ కం బ్యాక్ అంటూ ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ఎందుకంటే మంట కలిపిన మహాలక్ష్మి స్కీమ్, రుణమాఫీ, రైతుభరోసాపై రైతుల్లో తీవ్ర ఆందోళన, గుండెలు పిండిన గృహజ్యోతి, జాడలేని ఇందిరమ్మ ఇండ్లు, ఉసెత్తని ఉద్యమకారుల కుటుంబాలకు 250 చ.గజాల స్థలం, పేరుకే రాజీవ్ యువ వికాసం, ఉన్న స్కూళ్లకే మౌలిక సదుపాయాల దిక్కు మొక్కు లేదు. ప్రతీ మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్స్, చెరిగిపోయిన చేయూత ఇలా ఆరు గ్యారెంటీలను అటక మీదకు ఎక్కించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు స్థానిక సంస్థల ఎన్నికలలో తగిన గుణపాఠం నేర్పుతారని పేర్కొన్నారు.



## పాతికేళ్ల బిఆర్ఎస్ రజతోత్సవ పండగకు తరలిరండి

- కేటీఆర్

**ఆమనగల్లు,విశాలభారతి:**

తెలంగాణ ప్రజా గొంతుకలను ఏకం చేసి తెలంగాణ సాధనలో ముందుండి నడిపించిన బీఆర్ఎస్ పార్టీ 25 సంవత్సరాల రజతోత్సవ మన తెలంగాణ ఇంటి పండు సభకు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ గుప్తా, డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా లకు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ లోని ఆయన నివాస గృహంలో ఉప్పల వెంకటేష్ గుప్తా గంప వెంకటేష్ గుప్తాలు కలుసుకొని భగవద్గీతను అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఈనెల 27న వరంగల్ జిల్లా, ఎల్కతుర్తిలో జరిగే సభకు బీఆర్ఎస్ పార్టీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు, దండులా కదలిరావాలని గ్రామ గ్రామాన ప్రచారం చేపట్టినట్లు తెలిపారు. ఈ మేరకు నియోజకవర్గ వ్యాప్తంగా రజతోత్సవ సభకు సంబంధించిన గోడరాతలు నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుండి బహిరంగ సభకు ఈ నెల 27న ప్రణాళిక బద్ధంగా నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. ఈ మేరకు నియోజకవర్గంలో అవసరమైన ప్రదేశాలలో గోడరాతలు రాయిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. కల్వకుర్తి నియోజకవర్గం నుండి ప్రతి గ్రామం నుంచి బిఆర్ఎస్ కార్యకర్తలు నాయకులు అభిమానులు సొంత పార్టీ పండుగకు దండుగా కదిలి రావాలని కోరారు. కేటీఆర్ కలిసిన వారిలో బి.ఆర్.ఎస్ నాయకులు గోపాల్ నాయక్, ఓరుగంటి వెంకటరెడ్డి, గణేష్, వంశీ తదితరులు ఉన్నారు.



## డైమండ్ జ్యువెలర్స్ ను ఆదరించాలి

- బంగారు ఆభరణాల కొనుగోలుపై ఉచిత ఇన్సూరెన్స్.
- ప్రతినెల పొదుపుతో బంగారం కొనవచ్చు.
- సూర్యాపేటలో ఘనంగా డైమండ్ జ్యువెలర్స్ షోరూం ప్రారంభం.

**సూర్యాపేట, విశాలభారతి:**

సరికొత్త మోడల్స్, అద్భుతమైన డిజైన్లతో నూతనంగా ఏర్పాటు చేసిన డైమండ్ జ్యువెలర్స్ షోరూంను సూర్యాపేట పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు ఆదరించాలని డైమండ్ జ్యువెలర్స్ ప్రొప్రైటర్లు తెడ్ల పురుషోత్తం, పోలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని నేషనల్ హైవే సర్వీస్ రోడ్డులో సీఎంఆర్ షాపింగ్ మాల్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన డైమండ్ జ్యువెలర్స్ గోల్డ్, డైమండ్స్, అండ్ సిల్వర్ ఆభరణాల షోరూంను ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దపెద్ద నగరాలకు వెళ్లకుండా సూర్యాపేట పట్టణంలోనే సరికొత్త మోడల్స్, అద్భుతమైన డిజైన్లతో మన్నికైన ధరతో అందించేందుకు డైమండ్ జ్యువెలర్స్ ను ప్రారంభించినట్లు తెలిపారు. సూర్యాపేటలో మొట్టమొదటిసారిగా బంగారు ఆభరణముల కొనుగోలుపై ఉచిత ఇన్సూరెన్స్ ను ప్రవేశపెట్టినట్లు తెలిపారు.దీని వల్ల బంగారు ఆభరణాలకు ఊహించని నష్టం, దొంగతనం జరిగినప్పుడు మరింత భద్రత లభిస్తుందన్నారు.తమ షోరూమ్ నందు కొనుగోలు చేసిన ఆభరణాలకు అత్యాధునిక క్యారెట్ మీటర్ ద్వారా ప్యూరిటీ సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు చెప్పారు. బంగారు ఆభరణాల కొనుగోలు కలలను నిజం చేసేందుకు ప్రతినెల కొంత మొత్తం పొదుపు చేసేలా సేవింగ్స్ స్కీమ్ కూడా అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. డైమండ్ జ్యువెలరీస్ కు వినియోగదారుల నమ్మకమే అతిపెద్ద చిహ్నమని అన్నారు. డైమండ్ జ్యువెలర్స్ సేవలను అన్ని వర్గాల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఫరూఖ్, వనమా వెంకన్న, తెడ్ల ప్రభాకర్, అఖిల్, పవన్,ఉమా, రుక్మిణి, అనురాధ,పల్లవి, దివ్య, మమత తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలి

- తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ స్టేట్ చైర్మన్ మారం జగదీశ్వర్.

**సూర్యాపేట,విశాలభారతి:**



ఇప్పుడున్న ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మూడు నెలల్లో పెండింగ్ బిల్లులను విడుదల చేస్తాం అని ఇచ్చిన హామీని ఇంత వరకు అమలు చేయలేదని తెలంగాణ జేఏసీ ఆల్ ఎంప్లాయ్ స్టేట్ చైర్మన్ మారం జగదీశ్వర్ అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రం సెవెన్ స్టార్ హోటల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఉన్న పెండింగ్ బిల్లులను, వచ్చే డిఎల్, పిఆర్సి కమిటీ సిపిఎస్ విధానాన్ని రద్దు చేయమని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. గత ప్రభుత్వంలో పెండింగ్లో ఉన్న బిల్లులన్నీ మా ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని రద్దు చేస్తామని అన్నారని, ప్రభుత్వం వచ్చి 15 నెలలు అవుతున్న ఇంతవరకు పట్టించుకోవడంలేదని వారు తెలిపారు. సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని, వేరే రాష్ట్రాలలో సిపిఎస్ విధానాన్ని రద్దు చేశారని ప్రభుత్వానికి గుర్తు చేశారు. 7.5 లక్షల కోట్ల అప్పు ఉందని చెప్పినప్పుడు మేము 15 నెలలు వేచి చూసి ఇప్పుడు మేము ప్రభుత్వాన్ని అడుగుతున్నామని అన్నారు. ఇప్పుడు 8 వేల కోట్ల పెండింగ్ బిల్లులు ఉన్నాయని చెబుతున్నారన్నారు. మళ్లీ ప్రతినెల 500 కోట్ల బిల్లు పెండింగ్లో ఉంటాయని.. ఇలా పోతూ పోతూ ఉంటే ప్రభుత్వం పెండింగ్ బిల్లులు ఎక్కువై చెల్లించలేని పరిస్థితిలో ఉంటుందని తెలిపారు. మేము ప్రభుత్వాన్ని కోరుతున్నాము మీరు ఉచితాలు ఇవ్వండి మాకు సంబంధం లేదు, మా పెండింగ్లో ఉన్న బిల్లులను పి ఆర్ సి ఇచ్చిన తర్వాత మా బిల్లులు ఇవ్వవలసిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని అన్నారు. మా ఉద్యోగులకు లక్షల లక్షలు బిల్లులు పెండింగ్లో ఉన్నాయని అన్నారు. హెల్త్ కార్డుల గురించి కూడా ప్రభుత్వం ఇంతవరకు పట్టించుకోవడంలేదని తెలిపారు. భారతదేశంలో తెలంగాణను నెంబర్ వన్ స్థానంలో మేము ఉంచుతామని మా బాధ్యతను మీరు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్ షేక్ జానీమియా, అడిషనల్ జనరల్ సెక్రటరీ తంగెళ్ల జితేందర్ రెడ్డి, ఇంజనీర్ జేఏసీ చైర్మన్ పాండు నాయక్,డిప్యూటీ సెక్రటరీ జనరల్ దున్న శ్యామ్, కో చైర్మన్లు వీరన్న, డిప్యూటీ సెక్రటరీ జనరల్ లక్కపాక ప్రవీణ్, జహంగీర్, జేసి జాయింట్ సెక్రటరీ డి స్వప్న, సిటీవో డిపార్ట్మెంట్ చైర్మన్ రవీందర్ బాబు, నాయిని ఆకాష్ వర్మ, ఎం సైదులు, బి వెంకన్న, సతీష్, రవి, మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శనివారం,
26.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com





# ఉగ్రవాదులను ఉరితీయాలి

- కాశ్మీర్ ఉగ్ర దాడి కి నిరసనగా ముస్లిం సోదరుల భారీ ర్యాలీ*

* ఇది మానవత్వం పై దాడి, దేశం పై దాడి

- ఉగ్రవాదం నశించాలి మిన్నంటిన నినాదాలు

**ఆమనగల్లు,విశాలభారతి:**
కాశ్మీర్ లో జరిగిన ఉగ్ర దాడికి నిరసనగా ముస్లిం మతపెద్దల పిలుపు మేరకు అమనగల్లు పట్టణం లోశుక్రవారం నమాజ్ అనంతరం ముస్లిం సోదరులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాశ్మీర్ లో పర్యాటకులపై జరిగిన ఉగ్ర దాడి అత్యంత హెయమైన చర్య గా అభివర్ణించారు. ఇలాంటి ఘతుకానికి పాల్పడిన ఎవ్వరిని వదిలిపెట్టేది లేదని కేంద్ర ప్రభుత్వం తీసుకునే ఎలాంటి చర్యలకైనా భారత దేశం ముస్లిం ల మద్దతూ ఉంటుందని తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్రం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇలాంటి వారిని కఠినంగా శిక్షించాలని అన్నారు. భారతదేశం లో హిందూ ముస్లింలు అన్నదమ్ములవలే కలిసిమెలిసి ఉన్నారని దీన్ని విచ్ఛిన్నం చేయాలనీ ఉగ్రవాదులు చేసే కుట్రలు ఎన్నటికీ సఫలం కావని ఈ సందర్భంగా వారిని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉగ్ర దాడి లో ప్రాణాలు కోల్పోయిన వారికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో జామియా మజీద్ కమిటీ అధ్యక్షులు మొహమ్మద్ మాసూమ్, అబ్దుల్ ఖలీల్, సయ్యద్ ఖలీల్, జహంగీర్, నయుం, జబ్బార్, ఎంఏరహీం, ఎంఏ కలీం, అలీమ్, కలీం, అల్తాఫ్, మజీద్ ఖురేషి, అజ్జు, చాంద్, అహ్మద్, జహంగీర్ పాషా,ఇస్మాయిల్, ఆరిఫ్, అసద్, అమీర్ పాషా, రావూఫ్, షాబు, తదితరులు ఉన్నారు.

**హిందుస్థాన్ జిందాబాద్.. పాకిస్తాన్ ముర్దాబాద్**

*** కడ్తాల్ లో ముస్లిం మైనార్టీల ర్యాలీ**

**•ఉగ్రవాదులను అంతమొందించాలని పిలుపు**

రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల కేంద్రం లో ముస్లిం మైనార్టీలు ర్యాలీ నిర్వహించారు. పాకిస్తాన్ ఉగ్రవాదుల చేష్టలపై కదం తొక్కారు. ఉగ్రవాదులపై ఉక్కుపాదం మోపాలంటూ శుక్రవారం నమాజ్ ప్రార్థనల అనంతరం పెద్ద ఎత్తున కదలి వచ్చారు. నరేంద్ర మోడీ తీసుకునే ప్రతి నిర్ణయం లో ముస్లిం ప్రజల భాగస్వామ్యం ఉంటుందని ఎలాంటి సందేహాలు అవసరం లేదని తామందరం భారతదేశ బిడ్డలం అంటూ స్పష్టం చేశారు. భారతదేశ ఒక సెక్యూలర్ దేశమని ఇందులో ఎలాంటి సందేహం ఉండబోదని రాజకీయ నాయకులు పార్టీల స్వార్థం వీడి దేశ భద్రతకు దేశ ఔన్నత్యానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమయం వస్తే ముందుగా నిలబడేది ముస్లిం పౌరులేనని పాకిస్తాన్ అడ్డగోలు చేష్టలను చూస్తూ ఊరుకోమని భారతమాత బిడ్డలమే అందరం అంటూ నినదించారు. భారత ప్రధానమంత్రి మోడీ ఎలాంటి నిర్ణయం తీసుకున్న తమకు సమంజసమేనని ఈ దేశంలో మాత్రం టెర్రరిజం అనే భూతాన్ని పారద్రోలాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు , హైమత్ జానీ , జహంగీర్ అలీ, ఆసిఫ్ అలీ, లాయక్ అలీ, మహమ్మద్ఇర్షాద్, జహంగీర్ బాబా, అక్బార్ అలీ, ఖాజా మైనొద్దీన్, అష్రాఫ్, గౌస్, బాబా, నదీమ్, ఇద్రిస్, మిస్సి, అత్తిక్, జావీద్, భారీ, లతీఫ్, నుభైద్,అబ్దుల్లా. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.



# పేదలకు అండగా పెద్ది

- వసంత చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేదలకు ఆర్థిక చేయుత

**విశాలభారతి,భీమదేవరపల్లి :**
మండలంలోని కొప్పూర్ గ్రామానికి చెందిన బొల్లవేన శివకృష్ణ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. మృతుని కుటుంబ ఆర్థిక పరిస్థితి స్థానిక కాంగ్రెస్ యువజన నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ వైస్ చైర్మన్, పెద్ది వెంకటనారాయణ వసంత చారిటబుల్ ఆధ్వర్యంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు మృతుని కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ పోగుల శ్రీకాంత్, కొప్పూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు మంద సమ్మయ్య, గట్టు ప్రభాకర్ , యూత్ కాంగ్రెస్ నాయకులు చిటుకూరి నితిన్, శ్రీకాంత్, శ్రీను, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# వరంగల్ కు బయలుదేరిన సైకిల్ యాత్ర

**సూర్యాపేట,విశాలభారతి:**
ఈనెల 27న వరంగల్ లో జరిగే బిఆర్ఎస్ పార్టీ రజితోత్సవ సభ కు సూర్యాపేట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పుట్ట కిషోర్, బీఆర్ఎస్ పార్టీ పట్టణ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కీసర వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి సైకిల్ యాత్ర బయలుదేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైకిల్ యాత్రకు అడుగు అడుగున స్వాగతం పలుకుతూ విరాళాలు అందజేస్తున్నారని తెలిపారు. అభిమానులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి కెసిఆర్ సభను విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా కొరివి వీరన్న విరాళం అందజేయగా ఎల్గూరి రాంబాబు గౌడ్ మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గాలి సాయికిరణ్, వెన్న రవితేజరెడ్డి, మంద కమలాకర్, దొనకొండ నరేష్, కొమ్మ ప్రవీణ్, గోనె అశోక్, రుద్రారపు నాగరాజు, రాకురి సైదులు, ప్రభాకర్, శివరామకృష్ణ, గణేష్, గట్టు సాయి, దేశ గాని శ్రీనివాస్ గౌడ్, శిగ గణేష్, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు విస్తరణలో వివక్ష తగదు



**ఆమనగల్లు, విశాలభారతి:**
ప్రజా ప్రయోజనాల కోసం ఆమనగల్లు లో నిర్వహిస్తున్న రోడ్డు విస్తరణ కొందరికి పరిమితం కావడం అన్యాయమని, విస్తరణలో వివక్ష తగదని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ కందుకూర్ డివిజన్ సభ్యుడు జంతుక శంకర్ ఆక్షేపించారు. శుక్రవారం మాట్లాడుతూ విస్తరణలో అందరికీ ఒకే విధమైన నిబంధన అమలు చేయాలని, కొందరికి మినహాయింపు ఇవ్వడం సమంజసం కాదన్నారు. ఇష్టానుసారంగా విస్తరణ పనులు చేయడం పేదల హక్కులను కాలరాయడమేనని అన్నారు.

# డ్రగ్స్ భారీ నుండి పిల్లలను కాపాడుకోవాలి

- బాధ్యత తల్లిదండ్రులదే
- మండల జేఏసీ చైర్మన్ డ్యాగల సారయ్య.



**విశాలభారతి,భీమదేవరపల్లి:**
మండలంలో గత 5 రోజులుగా కొనసాగుతున్న డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్ర ముల్కనూర్ వెంకట సాయి గార్డెన్ లో ముగింపు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిడిపిఓ స్వరూప రాణి హాజరైనారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డ్రగ్స్, బెట్టింగ్, ఆన్లైన్ గేమ్స్ లాంటి చెడు వ్యసనాల వల్ల విద్యార్థులు, యువతి, యువకులు జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. తల్లిదండ్రులు బాధ్యత తీసుకొని సక్రమ మార్గంలో నడిపించాలని కోరారు. అనంతరం జేఏసీ చైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి, డ్యాగల సారయ్య, మేకల వీరన్న యాదవ్ మాట్లాడుతూ, పట్టణాలకే పరిమితమైన డ్రగ్స్ మన పల్లెకు విస్తరించిందని, మన పిల్లలు రోజువారిగా పరిశీలించవలసిన అవసరం ఉందని అన్నారు. మండల వ్యాప్తంగా 25 గ్రామాల్లో యాత్రలు చేసి, సభలు, సమావేశాలు నిర్వహించి మహిళా సంఘాలను ఐక్యం చేసి శుక్రవారం ముగింపు యాత్ర నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన మహిళా సంఘాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ హుస్నాబాద్ నియోజకవర్గం హుస్నాబాద్ కోఆర్డినేటర్ మేకల వీరన్న, ఏరుకొండ నరసింహ, అంబేద్కర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్, మాజీ ఎంపీపీ అశోక్ ముఖర్జీ, ముల్కనూరు మాజీ సర్పంచ్ మాడుగుల కొమురయ్య, మహనీయుల ఉత్సవ కమిటీ చైర్మన్ కొలుగురి రాజు, మండల మహిళా సంఘ నాయకులు మహిళ జేఏసీ హుస్నాబాద్ నియోజకవర్గ చైర్మన్ కోడూరి శ్రీదేవి, జేఏసీ గాండ్ల పద్మ, జేఏసీ హుస్నాబాద్ మండల చైర్మన్ దండి లక్ష్మి, ఎమ్మార్పీఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి మాట్ల వెంకటస్వామి, తెలంగాణ అంబేద్కర్ సంఘ కార్యదర్శి కండె సుధాకర్, ఎమ్మార్పీ సీనియర్ నాయకులు రేణికుంట్ల బిక్షపతి, ఎమ్మార్పీఎస్ నాయకులు తాళ్లపల్లి ఆశీర్వాదం, ఎస్ఆర్ టి కాలేజ్ ప్రిన్సిపాల్, ఎదులాపురం మొగిలి, డాక్టర్ తిరుపతి, డాక్టర్ టి.సుధాకర్, ముల్కనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రదీప్ రెడ్డి, వేముల జగదీష్, తాళ్లపల్లి ప్రభాకర్, తాళ్లపల్లి జగన్, తదితరులు పాల్గొన్నారు.




# పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి అత్యంత హేయం

**సూర్యాపేట,విశాలభారతి:**
జమ్మూకాశ్మీర్లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి అత్యంత హేయమని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి చకిలం రాజేశ్వరరావు, జిల్లా మహిళ అధ్యక్షురాలు తిరుమల ప్రగడ అనురాధ కిషన్ రావు అన్నారు. ఉగ్రవాదుల దుర్మార్గపు చర్యకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ సూర్యాపేట నియోజకవర్గ ఇన్చార్జి రాంరెడ్డి దామోదర్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అంజద్ అలీ,మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం నుండి కొత్త బస్టాండ్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీగా బయలు దేరి నిరసన ప్రదర్శన నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కొవ్వొత్తులతో అమరులైన వారి ఆత్మశాంతికి మౌనం పాటించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడారు.బిజెపి ప్రభుత్వం చేతగానితనం కారణంగానే ఉగ్రదాడులు జరుగుతున్నాయని ఆక్షేపించారు. ఉగ్రవాదులు ఎక్కడో దాక్కొని అమాయకులైన ప్రజల పైన తుపాకీ తూటాలు ఎక్కు పెట్టడం నీతిమాలిన చర్య అని పేర్కొన్నారు. జమ్మూ కాశ్మీర్లో శాంతిభద్రతలను పునరుద్ధరించామన్న మోడీ, అమిత్ షా ప్రచారం బూటకమని తేలిపోయిందన్నారు. అమాయక పర్యాటకులను పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదులను మట్టి కల్పించాలన్నారు.పర్యాటకులపై దాడి చేయడం చాలా బాధాకరమన్నారు. దీనిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. పాకిస్తాన్ తీవ్రవాదులు శిక్షించాలని నినాదాలు చేశారు. పెహల్గామ్లో ఉగ్రదాడిలో మరణించిన వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో అబ్దుల్ రహీం,కరిముల్లా జావిద్ బేగ్,పొలగాని బాలు గౌడ్,చింతమళ్ళ రమేష్, అన్నమయ్య రాము, సిద్దిక్,బొడ్డు సాయి,కస్పరాజు రమేష్,కోడి శివ యాదవ్,మద్దే బోయిన శ్రీనివాస్, తిరుమలేష్, బొజ్జ సంజయ్,ఆలేటి మాణిక్యం,నాగుల వాసు, అయూబ్ ఖాన్, పందిరి మల్లేష్, పిడమర్తి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలి

- అడవులను, ఖనిజ సంపదను కాపాడాలి. ఆదివాసీల హనాన్నని ఆపాలి.
- ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కొత్త బస్టాండ్ వద్ద నిరసన.




**సూర్యాపేట,విశాలభారతి:**
మావోయిస్టులతో శాంతి చర్చలు వెంటనే జరపాలని సామాజిక అధ్యయన వేదిక కన్వీనర్ ఎల్ భద్రయ్య, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మందారి డేవిడ్ కుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ములకలపల్లి రాములు, సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా నాయకులు పేర్ల నాగయ్య అన్నారు. శుక్రవారం ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్చలు జరపాలని, మావోయిస్టుల పై, ఆదివాసుల పై జరుగుతున్న దమన కాండం ఆపివేయాలని కోరుతూ సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండు వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడవిలో ఉన్న ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే ఉద్దేశంతో మావోయిస్టులను, ఆదివాసులను అడవుల నుంచి వెళ్లగొట్టేందుకు అడవులలో ధమనకాండ కేంద్ర ప్రభుత్వం చేస్తుందన్నారు. 2026 లో మావోయిస్టు రహిత దేశంగా ప్రకటిస్తామని కేంద్ర మంత్రి అమిత్ షా అనడం సరికాదన్నారు. ఎన్నో దశాబ్దాలుగా ప్రజల హక్కుల కోసం, ఆదివాసి గిరిజనుల హక్కుల కోసం మావోయిస్టులు పోరాటం చేస్తున్నారన్నారు. వారిని గత కొన్ని రోజులుగా బూటకపు ఎన్కౌంటర్లు చేస్తూ చంపడం తగదన్నారు. భారత రాజ్యాంగానికి లోబడి పాలన చేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే మావోయిస్టులతో చర్చలు జరపాలని లేకుంటే ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బుద్ధి జీవులుగా మనమంతా ఐక్యంగా రాజ్యయుద్ధాన్ని ఓడించాలని కోరినారు .ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు మట్టి పెల్లి సైదులు, కోట గోపి, ఆవుల నాగరాజు,నారా బోయిన వెంకట్ యాదవ్, రేపాక లింగయ్య, యోగానంద చారి, మందడి వెంకటరెడ్డి , నల్లెడ మాధవరెడ్డి, కరీం, వెంకటేశ్వర్లు, జోసఫ్ కన్నా, కోటయ్య, కునుకుంట్ల సైదులు, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.



# ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి కొవ్వొత్తులతో నివాళులు

**దేవరకొండ, విశాలభారతి:**
పట్టణంలో ప్రజాసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో స్థానికంగా ఐబీ సెంటర్ నుండి బస్టాండ్ వద్ద ఉన్న బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వరకు కొవ్వత్తుల నిరసన ర్యాలీ చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జమ్మూకాశ్మీర్ రాష్ట్రంలోని పెహల్గావ్ వద్ద పర్యాటక్కులపై ఉగ్రవాదులు విచక్షణా రహితంగా కాల్పులు జరిపి 30మందిని పొట్టన పెట్టుకున్న ఘటనను తీవ్రంగా ఖండిస్తూ, వారిని వెంటనే శిక్షించాలని భారత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాల్పుల్లో అమరులైన వారికి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో కంబాలపల్లి వెంకటయ్య,నీరసమెట్ల సుందరయ్య,పొట్టేపాక మురళి కృష్ణ, అరేకంటి ఎసయ్య, ఎర్ర కృష్ణ జాంభవ్, పంది శ్రీరాములు, జగదీష్, పొట్ట ప్రభు, అంకూరి శివ,ఎర్ర విజయ్, ఎర్ర ఆంజనేయులు,కొమ్ము రాజశేఖర్,చాట్ల ప్రశాంత్,ఉదయ్, నవీన్,నాని, వంశీ, విజయ్,అరుణ్,లింగం, చెన్నయ్య,వంశీ తదితరులు పాల్గొన్నారు.



# బిఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కుటుంబానికి ఆస్తులు రాష్ట్రానికి అప్పులు

- కేసీఆర్ ది కుటుంబం పాలన
- పదేళ్లలో ఆయన స్వార్థ ప్రయోజనాల కోసమే
- ఉద్యమకారులెవరు బిఆర్ఎస్ సభలలో కనబడరు
- బిజెపి మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్

**విశాలభారతి, ఎల్కతుర్తి:**
హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలో 27న జరగబోవు బిఆర్ఎస్ 25సంవత్సరాల రజతోత్సవ సభ దాదాపు 200కోట్ల ఖర్చుతో అంగరంగ వైభవంగా 1500 ఎకరాలలో జరుగుతున్నటువంటి సభను ఉద్దేశించి ఎల్కతుర్తి బిజెపి మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ 25వ వసంతంలో అడుగుపెడుతున్న సందర్భంలో సభ ఏర్పాటు చేసుకొని సంబరాలు జరుపుకునేందుకు మాకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. కానీ వారు చేసుకునే సంబరాలలో తెలంగాణ కోసం కొట్లాడిన ఉద్యమకారులు విద్యార్థులు సకలజనులు ఉంటారా అంటే ఎవరు ఉండరనీ జోస్యం చెప్పారు. తెలంగాణ వచ్చిన తర్వాత మొట్టమొదటిగా దళితున్ని ముఖ్యమంత్రి చేస్తానని మాట ఇచ్చి నువ్వే గద్దేనెక్కవు ఉప ముఖ్యమంత్రిగా డాక్టర్ రాజయ్యకు పదవి ఇచ్చినట్టే ఇచ్చి అతనిపై అవినీతి ఆరోపణ చేసి మళ్లీ లాగేసుకున్నావ్ దళితులకు మూడెకరాల భూమి ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ కుటుంబ సభ్యులకే అధికారం ఉండాలి తప్ప ఇంకెవరు అధికారాన్ని ఆశించకూడదు దానికి నిదర్శనం ఈటెల రాజేందర్ నువ్వు పరిపాలించిన పది సంవత్సరాలలో తెలంగాణ అభివృద్ధి ఏమీ లేదు అభివృద్ధి అంతా నీ యొక్క కుటుంబ ఆస్తులే తప్ప తెలంగాణకు మొత్తం అప్పులే నువ్వు ఒక్కడివి కొట్లాడితే తెలంగాణ రాలేదని ఆయన అన్నారు.

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

శనివారం,
26.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com

6

GENERAL NEWS



# దండం పెడతాం మాకు రోడ్డు వెయ్యండి

- వర్షా కాలం వస్తే ఎన్ని ప్రాణాలు పోతాయో అర్థం కాని పరిస్థితి

**మణుగూరు, విశాలభారతి:**

భద్రాద్రి జిల్లా బూర్గంపాడు మండలం సారపాక గ్రామపంచాయతీ పరిధిలో గల శ్రీరామ్ పురం ఎస్టీ కాలనీలో మీకు దండం పెడతాము సారు మాకు రోడ్డు వేయండి అంటూ రెండు చేతులు జోడించి చిన్న పిల్లలు మొదలుకొని గిరిజనులు,పండు ముసలి, వరకు వేడుకుంటున్నారు. వర్షాకాలం వస్తే ఎన్ని ప్రాణాలు పోతాయో అర్థం కాని పరిస్థితిలో గిరిజన బిడ్డలు ఉన్నారు. ఆ నాయకుడు వస్తే చేస్తాడు ఈ నాయకుడు చేస్తాడు, అని ఓట్లు వేసారు. ఇంతవరకు ఆ గ్రామానికి ఎటువంటి సౌకర్యాలు కల్పించలేదు. కనీసం మట్టి రోడ్డు అయినా పోయమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంతవరకు ఏ అధికారి గాని ఏ నాయకుడు కానీ ఆ గ్రామం వైపు కన్నెత్తి చూడటం లేదు. ఈ గ్రామంలో కరెంటు లేదు, మంచినీటీ సదుపాయం లేదు. ఈ కాలనీలో ఉన్న చిన్న పిల్లలు సుమారు 60 నుంచి 70 మంది ఉన్నారు, వారికి పాఠశాల లేదు సరైన రోడ్డు లేదు ఇప్పటివరకు ఎంతో మంది అధికారులకు దరఖాస్తులు ఇచ్చారు, కానీ ఏ అధికారి వారిపై దయ చూపలేదు వర్షాకాలంలో ఎవరికైనా ఆరోగ్యం బాగా లేదంటే సరైన రోడ్డు మార్గం లేక కావిడి కట్టుకొని తీసుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది, అలా ఎంతోమందిని తీసుకు వెళ్ళారు. కొందరు ప్రాణాలతో తిరిగివచ్చారు మరికొందరు తిరిగిరాని లోకాలకు వెళ్లారు. మాపై దయచూపి మాకు రోడ్డు వేయగలరని చిన్న పిల్లలు మొదలుకొని పండు ముసలి వరకు అందరు కలిసి రెండు చేతులు జోడించి వేడుకుంటున్నారు.

## దోమల నిర్మూలనతో రోగాలు దూరం




**ఆమనగల్లు,విశాలభారతి:**

ప్రజారోగ్యానికి ప్రధాన శత్రువు దోమలని, పరిసరాలపరిశుభ్రత, దోమల నిర్మూలనతో వ్యాధులకు దూరంగా ఉండవచ్చని వైద్యులు తెలిపారు.శుక్రవారంఆమనగల్లులో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించి వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు మంజులాదేవి, మైమునబేగం, నాగరాజు, విజయ,సీహెచ్ తిరుపతిరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# వరంగల్ సభను విజయవంతం చేయాలి

- జనగామ జిల్లా నాయకులు బబ్బూరి శ్రీకాంత్ గౌడ్



**దేవరుప్పుల, విశాలభారతి:**

ఈ నెల 27 న వరంగల్ లో జరిగే రజతోత్సవ బహిరంగసభను విజయవంతం చేయాలని దేవరుప్పుల మండలం,పెద్దమాదుర్ గ్రామంలో ఏర్పాటు చేసిన బిఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో బిఆర్ఎస్ జనగామ జిల్లా నాయకుడు బబ్బూరి శ్రీకాంత్ గౌడ్,దేవరుప్పుల మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తీగల దయాకర్ బిఆర్ఎస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కేసీఆర్ గారి పాలనలో తెలంగాణ సుభిక్షంగా ఉందని ప్రజలే అంటున్నారని,కేసీఆర్ ని చూడడానికి ప్రజలందరు ఉత్సాహంగా ఉన్నారని,దేశ చరిత్రలో నిలిచిపోయేలా వరంగల్ సభకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, ప్రజలే స్వచ్ఛందంగా సభకు తరలివస్తామని తెలుపుతున్నారని,పెద్దమదుర్ గ్రామం బిఆర్ఎస్ కు కంచుకోట కాబట్టి ఊరు వాడ పెద్ద ఎత్తున ప్రజలు తరలి రావాలని పిలుపునిచ్చారు. అనంతరం బిఆర్ఎస్ శ్రేణులతో కలిసి బిఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాంసింగ్,మండల ఉపాధ్యక్షుడు నల్ల ఉమేష్, గ్రామ పార్టీ అధ్యక్షుడు బండారు రాములు,మాజీ ఎంపీటీసీ పానుగంటి గిరి,గ్రామ ఇంచార్జీ తీగల సత్తయ్య,మండల యూత్ అధ్యక్షుడు నవిన్ నాయక్,గ్రామ సీనియర్ నాయకులు బబ్బూరి రవి,చంద్రగిరి సంపత్, గోడిశాల శివ, కారుపోతుల సత్తయ్య, మునిగోండ రాములు, బబ్బూరి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



## ఏజెన్సీలో గిరిజన చట్టాలకు అనుగుణంగా భూ భారతి

- కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ చేసిన- భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

**వాజేడు, విశాలభారతి:**

భద్రాచలం డివిజన్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు శుక్రవారం వాజేడు మండలంలో పర్యటించారు. మండల కేంద్రం వాజేడ్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. భద్రాచల నియోజకవర్గం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పేదవాడి కడుపు నింపడం కోసం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రభుత్వం చేపట్టిన భూ భారతి కార్యక్రమం ప్రతి పేదవాడి భూమి సమస్య లేకుండా గిరిజన చట్టాలకు అనుగుణంగా భూమి సమస్య పరిష్కరించడం కోసమే భూ భారతి తీసుకురావడం జరిగిందని ఆయన అన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇల్లు అర్హుడైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు వచ్చే విధంగా తన వంతు కృషి చేస్తానని ఆయన అన్నారు. ప్రభుత్వం చేపట్టిన ప్రతి సంక్షేమ పథకం పేద ప్రజలకు అందజేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాజేడు తాసిల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో విజయ, ఎంపీ ఓ శ్రీకాంత్ నాయుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రసాద్ బాబు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రమ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కళ్యాణ్ బాబు ప్రజలు పాల్గొన్నారు.

## లైన్స్ క్లబ్ ఆఫ్ నూతనకల్ నూతన కమిటీని ఏకగ్రీవం

**నూతనకల్, విశాలభారతి:**



లైన్స్ క్లబ్ ఆఫ్ నూతనకల్ నూతన అధ్యక్షులు బందు కృష్ణయ్య ను ,ప్రధాన కార్యదర్శిగా నాగం సుధీర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు . మండల కేంద్రంలోసమతా మీరా పారామెడికల్ కాలేజీలో లైన్స్ క్లలైన్స్ క్లబ్ ఆఫ్ నూతనకల్ 2025 ..2026 సంవత్సరానికి గాను నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నూతన అధ్యక్షులు బందు కృష్ణయ్య తెలిపారు . అనంతరం వారు మాట్లాడుతూ లైన్స్ క్లబ్ ఆఫ్ నూతనకల్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు లైన్స్ క్లబ్ సభ్యులకు లైన్స్ క్లబ్ పెద్దలకు ఎన్నిక కొరకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు .ఈ కమిటీలో ప్రధాన కార్యదర్శిగా నాగం సుధీర్ రెడ్డి ,కోశాధికారిగా బయ్య రవీందర్ ,ఉపాధ్యక్షులుగా సాదు రామకృష్ణారెడ్డి, షేక్ యాకుబ్ అలీ ,జాయింట్ సెక్రటరీగా నెంబర్ షిప్ కోన గంగరాజు ఎల్.సి.ఐ ఎఫ్ కో ఆర్డినర్ ఏలేటి. నారాయణరెడ్డి, అడ్మినిస్ట్రేషన్ చైర్మన్ సాబాది వెంకటరెడ్డి, బోర్డు ఆఫ్ డైరెక్టర్ షేక్ నాగుల్ మీరా ఎన్నికైరు. పరిశీలకులుగా నారాయణరెడ్డి, వెంకటరెడ్డి, నాగుల్ మీరా వ్యవహరించినారు.



## పహల్గాం ఉగ్ర దాడి పాశావీక, అనాగరికమైన చర్య

- కొవ్వొత్తులతో మృతులకు నివాళులర్పించిన శ్రీ విద్యాభ్యాస పాఠశాల విద్యార్థులు

**మణుగూరు, విశాలభారతి:**

జమ్ము కాశ్మీర్ లోని పహల్గాంలో టెర్రరిస్టులు అత్యంత క్రూరంగా దాడి చేసి ఇరవయి ఆరుగురు భారత పౌరులను చంపేయడం అత్యంత కిరాతకమైన చర్య అని ఇలాంటి దుశ్చర్యలను ప్రతి ఒక్కరు ఖండించాలని గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు యస్ డి నా సర్ పాషా అన్నారు. శుక్రవారం సాయంత్రం మణుగూరు మండలం సంతోష్ నగర్ లోని శ్రీ విద్యాభ్యాస పాఠశాలలో జరిగిన పహల్గాం మృతులకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ పర్యాటకులే లక్ష్యంగా ఆర్మీ యూనిఫాంలో వచ్చి దొరికిన వాళ్లను దొరికినట్లు పిట్టలను కాల్చినట్టు కాల్చి రక్తశక్తం చేసి మరణహోమం చేసిన మత ఉన్మాదుల చర్యలను పిరికిపంద చర్యగా ఆయన అభివర్ణించారు. భూలోక స్వర్గం కాశ్మీరును నరక ప్రాయంగా మార్చిన సంఘటన పట్ల ఆయన తీవ్ర దిగ్భ్రాంతి ప్రకటించారు. ఉగ్ర దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారిలో తెలుగు రాష్ట్ర యువకులు కూడా ఉన్నారనీ మృతులకు సంతాపం తెలియజేయడంతో పాటు వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. టెర్రర్ ఎటాకు యావత్ భారత్ ముక్తకంఠంతో ఖండిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆంగోత్ మంగీలాల్, శ్రీ విద్యాభ్యాస పాఠశాల నిర్వాహకులు బి జగన్మోహన్ రెడ్డి, సిబ్బంది రాధా పాల్గొన్నారు.



## రైతులు ప్రభుత్వ మద్దతులను పొందాలి

- పిఎసిఎస్ చైర్ పర్సన్ నాగం జయసుధ సుధాకర్ రెడ్డి

**నూతనకల్, విశాలభారతి:**

రైతులు ప్రభుత్వ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి నాణ్యమైన ధాన్యం తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని పిఎసిఎస్ చైర్పర్సన్ నాగం జయసుధ సుధాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బక్క హేమ్లాతండా గ్రామపంచాయతీలో ఏర్పాటుచేసిన ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. రైతులు తాలు, చెత్తాచెదారం, మట్టి పిల్లలు లేకుండా ధాన్యాన్ని శుభ్రం చేసి కేంద్రానికి తీసుకువస్తే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ఏ గ్రేడ్ రూ. 2320, సాధారణకు రూ. 2300ను పొందవచ్చు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ఎల్ సాయి ప్రసాద్, సెర్ప్ సీసీ సూరారపు సరస్వతి, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి గుగులోతు కృష్ణ నాయక్, మండల ప్రధాన కార్యదర్శి బంటు బద్రి, నాయకులు దామోదర్ నాయక్, లకుపతి, పాతులోతూ వీరన్న, జి. వెంకన్న, బాల్షింగ్, జలంధర్ నాయక్, పి బాల్య, పంతుల, సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన పల్లా సుందర్ రాంరెడ్డి

**దేవరుప్పల, విశాలభారతి:**

ధర్మాపురం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ యువజన నాయకుడు కన్నబోయిన సురేష్ వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన బిఆర్ఎస్ జిల్లా నాయకుడు పల్లా సుందర్ రాంరెడ్డి,బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ గౌడ్. ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షుడు బస్వ మల్లేశం,బిఆర్ఎస్ మండల నాయకులు జోగు సోమనర్సయ్య, అనంతోజు కృష్ణమూర్తి,గండిపల్లి యాకన్న,వంగ అర్జున్,కూతాటి నరసింహులు,ఇరుకుల సతీష్,యాకు,మండల,గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ రజతోత్సవ పండగకు యువత భారీగా కదలి రావాలి

- కాంగ్రెస్ ప్రభుత్వ నియంత పోకడలకు ఈ సభ చెంపపెట్టు కావాలి
- తుమ్మల నాగరాజు రెడ్డి బిఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షులు

**చిట్యాల, విశాలభారతి:**



బిఆర్ ఎస్ పార్టీని స్థాపించి 25 సంవత్సరాలు విజవంతంగా పూర్తి చేసుకున్నందునా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అధ్యక్షతన రేపు బి ఆర్ యస్ పార్టీ రజతోస్సవ పండగను వరంగల్ ఎల్కతుర్తి గ్రామంలో ఘనంగా ఏర్పాటు చేయడం జరుగుతుంది.కావున బి ఆర్ యస్ పార్టీ యువత మరియు పార్టీ శ్రేణులు స్థానికులతో కలిసి భారీ సంఖ్యలో తరలి రావాలని పిలుపునిస్తున్నా.కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల పేరు చెప్పి తెలంగాణ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వొచ్చిందని,రైతులకు రుణమాఫీ ఎఒక్క గ్రామంలో పూర్తిస్థాయిలు అమలు చేయలేదని,నిరుద్యోగులకు ప్రభుత్వం వచ్చిన యాడాది లోపే లక్ష ఉద్యోగాలను భర్తీ చేస్తా అని హామీ ఇచ్చి గత బి ఆర్ యస్ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిన ఉద్యోగాలనే భర్తీ చేసి నిరుద్యోగులని మోసం చేసిందని, వయో, వృద్ధులకు పెన్షన్ పెంచుతానని చెప్పి ఆ ఊసే మరిచిందని, భూమి లేనివారికి ఆపన్న హస్తం, ఇల్లు లేని వారికి ఇండ్లు ఇస్తా అని వాయిదాలు వేసుకుంటూ పబ్బం గడుపుతుందని,మహిళలకు గృహలక్ష్మి, కళ్యాణ లక్ష్మి కింద తులం బంగారం, ఇలా చెప్పుకుంటూ పొతే 420 హామీలలో ఏ ఒక్కటి పూర్తిస్థాయిలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదు.ఎందరో ఉద్యమ కారుల ప్రాణ త్యాగాలతో తెలంగాణ తెచ్చు కొని గత పదేండ్లు ఎంత అభివృద్ధి చేసుకున్నాం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన దాదాపు రెండు సంవత్సరాలలోని తెలంగాణ అభివృద్ధి కుంటుపడింది.కావున ఇట్టి విషయాలను బి ఆర్ యస్ పార్టీ యువత గ్రామస్థాయిలో ప్రజలుకు వివరించి రజతోస్సవ సభకు తీసుకరావాలి.

## ఆదివాసి ఉద్యోగులపై వేధింపులను సహించం

- ఆదివాసి సంఘాల డిమాండ్

**మణుగూరు, విశాల భారతి :**



ఆదివాసి చిరు ఉద్యోగులపై వేధింపులను సహించేది లేదని ఆదివాసి సంక్షేమ పరిషత్ జిల్లా జేఏసీ అధ్యక్షులు వాగబోయిన చంద్రయ్య దొర డిమాండ్ చేశారు. శుక్రవారం నాడు ఆయన మాట్లాడుతూ పినపాక నియోజకవర్గం పరిధిలోని పలు ప్రభుత్వ పలు శాఖల్లో విధులు నిర్వహిస్తున్నటువంటి ఆదివాసి ఉద్యోగులపై లంబడి, గిరిజనేతరులు పలు రకాల ఆగడాలతో ఉద్యోగం చేయలేని విధంగా వేధింపులకు గురి చేసే విధంగా వ్యవహరిస్తే, ఇటువంటి ఘటనను సహించేది లేదని ఆయన అన్నారు. ఎంతో నిబద్దతో విధులు నిర్వహిస్తున్న చిరు ఉద్యోగులను వత్తుళ్లకు లోనైయ్యేవిధంగా వ్యవహరించే తీరు సరి కాదన్నారు. ఉద్యోగ బాధ్యతను సక్రమంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఆదివాసి చిరు ఉద్యోగులకు ఎటువంటి కష్టం వచ్చినా అన్నివేళ అండగా ఉంటామన్నారు. శృతి మించి వారి ఆగడాలతో ఏ ఒక్కరికి ఎటువంటి ఇబ్బంది కలిగిన తమ ఆదివాసి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలకి శ్రీకారం చుడతామని ఒక ప్రకటనలో తెలిపారు.

## అంగన్వాడి ఆయా కుటుంబానికి సాయం

**గరిడేపల్లి, విశాలభారతి:**



మండల పరిధిలోని పొనుగోడు గ్రామంలో అంగన్వాడి ఆయాగ పనిచేస్తున్నటువంటి నందిపాటి అరుణ ఇటీవల కాలంలో వడ దెబ్బతో మరణించారు. వారి కుటుంబ అవసరాల రీత్యా 50కేజీ ల బియ్యం 10 లీటర్ల నూనె ఇవ్వడం జరిగింది. అంబేద్కర్ కమిటీ అధ్యక్షులు. నందిపాటి నరేష్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అరుణ కుటుంబానికి రెండు లక్షల ఎక్స్గ్రేషన్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు చిటికెల కిరణ్, కోశాధికారి లంకపల్లి రమేష్, ప్రధాన అధ్యక్షులు ఒగ్గు మహేష్ కదురు మహేష్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నందిపాటి కోటయ్య చిలక పిచ్చయ్య నందిగామ సతీష్ మనోజ్ వెంకన్న గోపి లక్ష్మయ్య వెంకయ్య వెంకటయ్య అఖిల్ ఉన్నారు.



# వృద్ధులకు అవగాహన కల్పించిన సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్

అడ్డగూడూర్, విశాలభారతి:

యాదాద్రి భువనగిరి జిల్లా తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, అడ్డగూడూరు మండల శాఖ ఆధ్వర్యంలో, వయోవృద్ధుల సంక్షేమ చట్టం, నియమావలికి సంబందించిన ఫ్లెక్సీ, గోడపత్రిక పోస్టర్,తహశీల్దార్ శేషగిరిరావు చేతులమీదుగా కార్యాలయంలో, పోలీసు స్టేషన్ లో ఎస్ ఐ నాగరాజు చేతులమీదుగా కరపత్రాల ఆవిష్కరించారు. వారీకార్యాలయంలో గోడపత్రికలు అంటించి, ప్లేక్స్ లు ఏర్పాటు చేశారు లక్ష్మీ దేవికాల్వ, గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో అతికించ నున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ మండల శాఖ అధ్యక్షులు కానుగుల రాము మాట్లాడుతూ, తల్లిదండ్రులకు తమ పిల్లలే పోషణ కల్పించి ఎలాంటి ఇబ్బందులు బాధలు రాకుండా చూసుకోవాలని కోరారు. తల్లిదండ్రులను వృద్ధాశ్రమంలో చేర్పించవద్దని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సీనియర్ సిటిజన్ మండల అధ్యక్షుడు కానుగుల రాము ,కార్యదర్శి బైరెడ్డి రాంరెడ్డి, సభ్యులు కొలుగూరి రాములు ,బండి యాదగిరి, కంచుగట్ల వీరయ్య, గండమాల సాయిలు ,కోరేపు సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.



# భూములకు రక్షణగా భూ భారతి

- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు

అడ్డగూడూరు, విశాలభారతి:

భూములపై ఉన్న సమస్యలు పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి విధానాలకు తావు లేకుండా రక్షణగా భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. అడ్డ గూడూరు మండల కేంద్రంలో జెడ్ పి హెచ్ ఎస్ హై స్కూల్ మైదానంలో నిర్వహించిన భూభారతి పై రైతులకు అవగాహన సదస్సు కల్పించడానికి ఎమ్మెల్యే మందుల సామేలు, కలెక్టర్ హనుమంతరావు హాజరై మాట్లాడారు.న ఈ సందర్భంగా ఎమ్మెల్యే మందుల సామేలు, కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ.. భూభారతి చట్టం ద్వారా భూమి ఎవరిదో సమగ్ర వివరాలతో చట్టం తెచ్చామని భూమి అమ్ముకోవాలన్నా, కొనాలన్న పూర్తి వివరాలు భూభారతిలో ఉంటాయని పేర్కొన్నారు. ధరణి ద్వారా ఎంతో మంది రైతులకు నష్టం జరిగిందో రానున్న రోజుల్లో భూభారతి ద్వారా ఎలాంటి వివాదాలు లేకుండా సమస్యలు తీరుతాయని అన్నారు. రైతులకు ఏవైనా ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీవో కృష్ణారెడ్డి, తహసిల్దార్ శేషగిరిరావు, ఎంపీడీవో శంకరయ్య, ఏవో పాండురంగ చారి, ఆర్ ఐ ఉపేందర్,సింగిల్ విండో చైర్మన్ కొప్పు నిరంజన్ రెడ్డి, మోత్కూర్ మార్కెట్ వైస్ చైర్మన్ లింగాల నర్సిరెడ్డి, డైరెక్టర్లు చిత్తలూరు సోమన్న, బాలెంల విద్యాసాగర్,రైతులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కాల్ టు కమిషనర్

మద్దూర్, విశాలభారతి:



కొత్తగా ఏర్పడిన మద్దూరు పురపాలికలో అనేక సమస్యల గురించి వినడానికి ఈనాడు సంస్థ శుక్రవారం ఉదయం 11 నుండి 12 గంటల వరకు గంటపాటు ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని నిర్వహించింది.ఇందులో భాగంగా ప్రజలు నేరుగా మద్దూర్ కమిషనర్ చేన్విళ్ళ శ్రీకాంత్ కు కాల్ చేసి సమస్యలను విన్నవించుకున్నారు.వార్డుల్లో గల తాగునీటి సమస్యలు,డ్రైనేజీ, పారిశుధ్యం,రహదారుల మరమ్మతులు,పౌరసేవల లోపాలు,వీధిదీపాలు వెలగకపోవడం, నగరంలో పందులు, కుక్కల బెడదలు తదితర అంశాల గురించి ప్రజలు కాల్ చేయగా కమిషనర్ శ్రీకాంత్ ఓపిగ్గా ప్రతి ఒక్కరికి సమాధానమిస్తూ,సమస్యలను పరిష్కరిస్తూ పురపాలక అభివృద్ధి కోసం నా శాయశక్తులా కృషి చేస్తానని అన్నారు. పీఎస్ రామునాయక్ కూడా పురపాలక అభివృద్ధికి నా తోడ్పాటు ఎల్లపుడూ ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో నాగరాజు,గోవర్ధన్,భానుచందర్, డి.చంద్ర కాంత్ పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన తాసిల్దార్

తిరుమలగిరి, విశాలభారతి:

మండల కేంద్రంలో కొక్యా నాయక్ తండ గ్రామపంచాయతీలో ఎంఎంఎస్ రాజన్న కొనుగోలు కేంద్రానీ తహసీల్దార్ హరిప్రసాద్ పరిశీలన చేసి ధాన్యం శుభ్రత తేమ శాతం 17% ఉండేలా చూసుకావాలి అని రైతుల తోటి మాట్లాడారు. అదేవిధంగా ఎండలు ఎక్కవగా ఉన్నందుకు ఫస్ట్ ఎయిడ్ చికిత్స పరికరాలు ఓఆర్ఎస్ ప్యాకెట్లు కొనుగోలు కేంద్రంలో ఉండేటట్టు తగు జాగ్రత్తలు పాటించాలి, రైతులను ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలి అని కొనుగోలు కేంద్రం కమిటీ మెంబెర్స్ చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల అధికారి ఏ పి ఎం మధుసూదన్, సీసీ విజయలక్ష్మి, సి యఫ్ బానోతు లక్ష్మణ్ నాయక్, కొనుగోలు కేంద్ర నిర్వాహకులు గుగులోతు సుధాకర్, రూప కమిటీ మెంబెర్స్ , తదితరులు పాల్గొన్నారు.






# అనుమతిలేని స్కూల్ పై చర్యలేవి...?

- నిబంధనలకు విరుద్ధంగా హిదియ ఇస్లామిక్ ఇంటర్నేషనల్ స్కూల్ అడ్మిషన్లు దందా
- కనీసంగా బిల్డింగ్ కూడా పూర్తికాని వైనం
- ఆకర్షణీయ పేర్లతో తల్లిదండ్రులకు వల
- చోద్యం చూస్తున్న విద్యాశాఖ అధికారులు

విశాలభారతి హైదరాబాద్:

నగరంలో గుర్తింపులేని పాఠశాలలు విద్యార్థుల పాలిట శాపంగా మారుతున్నాయి. పాఠశాలకు గుర్తింపే ఉండదు.. ఫీజులు మాత్రం లక్షల్లో వసూలు చేస్తారు. అడ్మిషన్ ఫీజు, బుక్స్, యూనిఫాం, ప్రాజెక్టు తదితర పేర్లతో తల్లిదండ్రుల నుంచి అందనకాడికి లాగేస్తారు. ఏ మాత్రం విద్యాశాఖ నిబంధనలు పాటించకుండా దర్జాగా అడ్మిషన్ల ప్రక్రియ జరుపుతారు. చదువులు చెబుతూ మధ్యమధ్యలో ఫీజుల వసూళ్లు చేపట్టి డబ్బులు సంపాదిస్తున్నారు.

వివరాల్లోకి వెళ్ళితే హైదరాబాద్ అరంఘర్ లో హిదియ ఇస్లామిక్ ఇంటర్నేషనల్ స్కూల్ పేరుతో అడ్మిషన్లు ప్రారంభించారు. కనీసం స్కూల్ భవనం అయినా పూర్తి కాలేదు. ప్రభుత్వం నుండి ఎలాంటి గుర్తింపు పత్రాలు లేకుండా సీబీఎస్ఈ, ఎస్ఎస్సి, ఐజిసిఎస్ఈ ఇస్లామిక్ ఎడ్యుకేషన్ పేరుతో లక్షల రూపాయలు దండుకుంటూ , దర్జాగా అడ్మిషన్లు దందా కొనసాగిస్తుంది..ఇంత జరుతున్న లోకల్ అధికారులు పాఠశాలలపై చర్యలు తీసుకోకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఫలితంగా ప్రభుత్వ ఆదాయానికి కూడా గండి పడుతున్నా పరిస్థితి ఉంది. తక్షణమే ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పరిస్థితిలో హిదియ ఇస్లామిక్ ఇంటర్నేషనల్ స్కూల్ పేరుపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.




# ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ

- డాక్టర్ దుర్గా భవాని

పినపాక, విశాలభారతి:

పినపాక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వైద్యురాలు దుర్గాభవాని ఆధ్వర్యంలో ఏప్రిల్ 25న మలేరియా దినోత్సవం జరుపుకోవడం జరిగింది అని ఆమె తెలియజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామాలలో ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసరాలు శుభ్రపరచుకోవాలని తమ సిబ్బందితో కలిసి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండాలని వారు అన్నారు. ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన సదస్సు దాని ఆవశ్యకతను తెలియజేశారు. సీజనల్ వ్యాధులైనటువంటి మలేరియా ,డెంగ్యూ జబ్బులను నివారించుటకై ప్రజలంతా తమ బాధ్యతగా చైతన్యవంతంతో తమ ఇండ్లలోని గోళాలు, డ్రమ్ములు, ప్లాస్టిక్ డబ్బాలలోని నీటిలో తోక పురుగులు (దోమల లార్వాలు) లేకుండా క్లీన్ చేసుకోవాలని పిలుపు ఇచ్చారు. ప్రభుత్వ వైద్యశాలలో అన్ని రకాల జబ్బులకు రక్త పరీక్షలు నిర్వహించబడతాయని. ప్రజల సద్వినియోగం చేసుకోవాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

# క్యూట్ లుక్కులోనే హీటెక్కించేసిందిగా..

టాలీవుడ్‌లో గ్లామరస్ బ్యూటీగా తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు అందుకున్న నటీమణులలో రుహానీ శర్మ ఒకరు. తొలి చిత్రం 'చి.ల.సౌ'లో తన అణకువ నటనతో మంచి మార్కులు కొట్టేసింది. ఆ తరువాత కూడా ఆమె చేసిన సినిమాలు పెద్దగా హిట్లు కాకపోయినా ఆమెకు ఓ స్పెషల్ ఫాలోయింగ్ ఏర్పడింది. స్క్రీన్‌పై నెచ్చెలి క్యారెక్టర్లతో మెప్పించిన ఈ భామ, సోషల్ మీడియాలో మాత్రం మోడ్రన్ ట్రెండ్‌ను చూపిస్తూ నెటిజన్లను మెస్మరైజ్ చేస్తోంది. ఇటీవల రుహానీ పోస్ట్ చేసిన కొన్ని ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. వైట్ టీషర్ట్, బ్లాక్ షార్ట్‌లలో ఉన్న ఆమె లుక్స్ అదిరిపోయాయి. స్టైలింగ్‌లో రుహానీ చేసిన ఈ ఫోటో షూట్‌కు నెటిజన్ల నుంచి అదిరే స్పందన వస్తోంది. కెమెరా ముందే కాదు.. కెమెరా వెనుక కూడా తన స్టైయిలిష్ పర్సనాలిటీతో ఆకట్టుకుంటోంది ఈ నటి. ఆమె హైట్, హార్స్‌పుల్ లుక్స్‌కు మిక్స్ అయిన ఈ డ్రెస్ సెలక్షన్ ఆమెకు మరింత ఆకర్షణను తెచ్చిపెట్టింది. కుర్చీలో కూర్చున్న ఫోజ్ నుంచి.. నిలబడ్డ శాట్స్ దాకా, ప్రతీ ఒక్కటి రుహానీ గ్లామర్‌ను ఎలివేట్ చేశాయంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. ప్రస్తుతం ఈ పిక్స్ వైరల్‌గా మారడంతో ఆమె ఇన్‌స్టాలో ఫాలోవర్లు మరింత పెరుగుతున్నారు. ఫొటో షేర్ చేసిన తక్కువ సమయంలోనే 38 వేలకు పైగా లైక్స్ రావడం చూస్తుంటే.. రుహానీకి ఉన్న ఫాలోయింగ్ అర్థమవుతుంది. ప్రస్తుతం ఆమె తమిళం, మలయాళం భాషల్లోనూ అవకాశాలు అందుకుంటోంది. తెలుగులో కొన్ని కొత్త కథలు కూడా ఆమెను టచ్ చేస్తున్నాయట. ఇక ఈ పిక్స్ చూస్తుంటే త్వరలోనే ఓ బిగ్ బ్రేక్ కొట్టే ఛాన్స్ ఉందని అభిమానులు భావిస్తున్నారు. సమయానుకూలంగా ట్రెండీ ఫోటోషూట్లతో బిజీగా ఉండే రుహానీ, తన ఫిట్‌నెస్‌ను కూడా చాలా కేర్‌ఫుల్‌గా మెయింటేన్ చేస్తోంది.





# చీరలో కూడా స్టన్నింగ్..

టీవీ యాంకర్‌గా కెరీర్‌ను ప్రారంభించిన అనసూయ, తన ఎనర్జిటిక్ హోస్టింగ్ స్టైల్‌తో ఫ్యాన్ ఫాలోయింగ్‌ను ఏర్పరుచుకుంది. కానీ అక్కడితో ఆగలేదు. సిల్వర్ స్క్రీన్‌పై అడుగుపెట్టి విలక్షణ పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ, ఒక నటి గా తన ప్రత్యేకతను నిలబెట్టుకుంది. "రంగస్థలం" సినిమాలో రంగమ్మత్త పాత్ర ఆమెకు గుర్తింపు తీసుకువచ్చింది.అప్పటి నుంచి గ్లామర్, పవర్‌ఫుల్ రోల్స్‌తో పాటు సోషల్ మీడియాలోనూ క్రేజ్ పెంచుకుంటూ వస్తోంది. ఇప్పుడు అనసూయ తన కొత్త లుక్‌తో మళ్లీ ఫ్యాన్స్ మనసులు దోచేస్తోంది. తాజాగా ఆమె షేర్ చేసిన ఫోటోలు ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారాయి. బంగారు వర్ణం కలిగిన చీరలో అనసూయ సంప్రదాయ సౌందర్యాన్ని మలుపుతిప్పినట్టుగా కనిపిస్తోంది. ఈ చీరలోని పింక్, గ్రీన్ పువ్వుల డిజైన్లు అందరినీ ఆకర్షించగా, బోల్డ్ లుక్‌కు బదులుగా కాస్త నెమ్మదిగా నవ్వుతూ ఆమె ఇచ్చిన స్టిల్స్ అభిమానులను ఆకట్టుకున్నాయి. ఈ లుక్‌కు మేకోవర్‌గా చేసిన జ్యువెల్లరీ, మెరిసే చీర, ఎర్రకళ్ల బ్లౌజ్ కూడా అదనపు ఆకర్షణగా నిలిచాయి. అనసూయ ధరించిన చెవిపోగులు, చేతికడులు ఆమె సంప్రదాయ అందాన్ని మరింతగా హైలైట్ చేశాయి. ముఖ్యంగా ఆమె జడలో పెట్టిన పుష్పాల అలంకరణ ప్రత్యేకంగా చూపుతుంది. మేకప్ సాఫ్ట్‌గా ఉండగా, హైలైట్ అయిన అనసూయ నవ్వే ప్రధాన అస్త్రం అని చెప్పవచ్చు. ఈ ఫోటోలకు 3 గంటల్లోనే వేల సంఖ్యలో లైక్స్ రావడం చూస్తే, అనసూయకి ఉన్న క్రేజ్ ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. ఇలా ఫ్యాషన్‌లో ముందుండే అనసూయ ఈసారి సంప్రదాయానికి టచ్ ఇచ్చి అభిమానులను ఆశ్చర్యపరిచింది. ఆమె చూపించిన ఈ లుక్ ఒక పండగ స్పెషల్‌లా అనిపిస్తోంది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.